JATIYAPATRIKA ADITHIYA TELUGU DAILY
RNI No : APTEL/25/A2560

# జాతీయ పత్రిక ఆదిత్య

మానవసేవయే.... మాధవసేవ

ఎడిటర్ : యార్లపాటి శ్రీధర్

విలేఖరులు కావలెను
రెండు తెలుగు రాష్ట్రాల్లో నూతనంగా ప్రారంభించిన జాతీయ పత్రిక ఆదిత్య
తెలుగు దినపత్రికలో పనిచేయడానికి జిల్లా ప్రతినిధులు, నియోజకవర్గ ప్రతినిధులు, మండల స్థాయి విలేఖరులు కావలెను.
సంప్రదించవలసిన నెంబర్
9705347022
8978748144

ప్రచురణ : కర్నూలు | ఎడిటర్ : యార్లపాటి శ్రీధర్ | సంపుటి : 01 సంచిక : 242 | పేజీలు : 04, వెల రూ. 2 రూ/ | శుక్రవారం 22 మే 2026

## కనీస వేతనాలు భారీగా పెంచుతూ

# ప్రభుత్వం నిర్ణయం

- తెలంగాణలో కార్మికులకు గుడ్ న్యూస్ చెప్పిన సీఎం
- కార్మికుల కనీస వేతనాలు పెంచిన రాష్ట్ర ప్రభుత్వం
- జూన్ 1 నుంచి అమల్లోకి పెంచిన వేతనాలు రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించిన ప్రభుత్వం
- జోన్-1-కార్పొరేషన్లు, జోన్-2- మున్సిపాల్టీలు , జోన్-3 గ్రామీణం



**హైదరాబాద్ :**
: రాష్ట్రంలో కార్మికులకు సీఎం రేవంత్ రెడ్డి గుడ్ ?న్యూస్ చెప్పారు. కార్మికుల కనీస వేతనాల పెంపునకు సంబంధించి మంత్రివర్గ ఉప సంఘం నివేదిక మేరకు తీసుకున్న నిర్ణయాలను రేవంత్ రెడ్డి మీడియాకు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల 1.11 కోట్ల మంది కార్మికులకు మేలు జరుగుతుందని ఆయన వెల్లడించారు.

## భగీరథ్‌ను అప్పగించలేదు.. పోలీసులే అరెస్ట్ చేశారు



2 లో

- అప్పా జంక్షన్ తనిఖీల్లో బండి భగీరథ్ అరెస్ట్
- లొంగిపోయారనే ప్రచారాన్ని ఖండించిన రేవంత్
- పోలీసుల దర్యాప్తు సమాచారానికే ముఖ్యమంత్రి మద్దతు
- మైనర్ బాలిక అంశంపై రాజకీయాలను తప్పుబట్టిన సీఎం
- కేటీఆర్ తీరుపై తీవ్రస్థాయిలో ఆగ్రహం

**హైదరాబాద్ :**
పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న బండి భగీరథ్‌ను పోలీసులు చట్టప్రకారమే అరెస్ట్ చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా అప్పా జంక్షన్ వద్ద అతడిని పోలీసులు అదుపులోకి - మిగతా 2 లో

## రేవంత్ కు కేటీఆర్ బహిరంగ లేఖ..



2 లో

- పంట కొనుగోళ్ల సంక్షోభం నెలకొందంటూ రేవంత్ కు కేటీఆర్ లేఖ
- కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారన్న కేటీఆర్
- 10 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన
- గన్నీ బ్యాగుల కోసం రైతుల నుంచి డిపాజిట్ వసూలు చేస్తున్నారని మండిపాటు
- రైతు ద్రోహిగా రేవంత్ మిగిలిపోతారని వ్యాఖ్య

**హైదరాబాద్ :**
తెలంగాణలో ప్రస్తుతం పంట కొనుగోళ్ల సంక్షోభం నెలకొందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న కష్టాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంకా ఎంతకాలం మొద్దునిద్ర పోతారని ప్రశ్నిస్తూ ఆయనకు ఒక బహిరంగ లేఖ రాశారు. ఈ నెల 23న జరగబోయే రాష్ట్ర కేబినెట్ సమావేశంలోనైనా ప్రభుత్వం కళ్లు తెరిచి, అన్నదాతల సమస్యలపై దిద్దుబాటు చర్యలు చేపట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## నారా లోకేష్ నేతృత్వంలోని కమిటీకి చంద్రబాబు దిశానిర్దేశం



2 లో

- పారిశ్రామిక ప్రాజెక్టుల పురోగతిపై సీఎం చంద్రబాబు సమీక్ష
- ఒప్పందాలు చేసుకున్న ప్రాజెక్టులు వెంటనే ప్రారంభం కావాలని ఆదేశం
- ఎస్ఐపీబీ ద్వారా రూ.11.47 లక్షల కోట్ల విలువైన 282 ప్రాజెక్టులకు ఆమోదం
- ఇప్పటికే 114 ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయని వెల్లడించిన అధికారులు
- అనుమతులు, భూ కేటాయింపులు వేగవంతం చేయాలని సీఎం సూచన

**అమరావతి :**
రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు కాగితాలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో కార్యరూపం దాల్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. విశాఖ భాగస్వామ్య సదస్సులో కుదిరిన ఒప్పందాలు - మిగతా 2 లో

## తమిళనాడులో 59 ఏళ్ల తర్వాత కాంగ్రెస్‌కు మంత్రి పదవి.. ప్రమాణ స్వీకారంలో ఆసక్తికర ఘటన

**ఢిల్లీ :**
తమిళనాడు రాజకీయాల్లో ఆరు దశాబ్దాల తర్వాత ఒక చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. సుదీర్ఘ విరామం అనంతరం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వామి అయింది. అయితే, ఈ చారిత్రక ఘట్టం ఒక ఆసక్తికర సన్నివేశానికి, చిన్నపాటి వివాదానికి వేదికైంది. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యే.. - మిగతా 2 లో



2 లో

## 'మావిగన్'ను ప్రతిపాదించింది అందుకే: జగన్



- స్కాముల కోసమే చంద్రబాబు అమరావతి అంటున్నారన్న జగన్
- కేసీఆర్ రూ. 615 కోట్లతో అత్యాధునిక సచివాలయాన్ని కట్టారని ప్రశంస
- 'మావిగన్'కు రాష్ట్ర ప్రజలు మద్దతు పలికారని వ్యాఖ్య

**అమరావతి :**
చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉండటం రాష్ట్ర ప్రజలు చేసుకున్న పెద్ద దురదృష్టమని వైసీపీ అధినేత జగన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు తీసుకుంటున్న నిర్ణయాల వల్ల భవిష్యత్తులో కూడా ఏపీకి రాజధాని లేకుండా పోయే ప్రమాదం ఉందంటూ ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తాము ప్రతిపాదించిన - మిగతా 2 లో

# "కార్యకర్తే పార్టీకి అసలైన అధినేత"

## మహానాడు వేదికగా ప్రతి ఒక్కరికీ చేరాలని దిశానిర్దేశం

- 'కార్యకర్తే అధినేత' స్త్రీ శక్తి థీమ్‌తో మహానాడు నిర్వహించేందుకు పొలిట్ బ్యూరో నిర్ణయం
- మహానాడులో 19 తీర్మానాలు చేపట్టాలని పొలిట్ బ్యూరో నిర్ణయం
- ఏపీ-10, తెలంగాణ-4, అండమాన్‌కు సంబంధించి ఒక తీర్మానంపై చర్చ
- ఉమ్మడి తీర్మానాలు-4, రాజకీయ తీర్మానాలపై చర్చ
- బీసీలు తెలుగుదేశానికి కొండంత అండగా నిలిచారని సీఎం
- పొలిట్ బ్యూరో సమావేశంలో మొత్తం 19 తీర్మానాలకు ఆమోదం
- "మహానాడు-2026" నిర్వహణ ప్రధాన అజెండాగా కీలక నిర్ణయాలు



**అమరావతి :**
: తెలుగుదేశం మహానాడును ఈసారి "స్త్రీ శక్తి" థీమ్‌తో నిర్వహించాలని పార్టీ అధినేత చంద్రబాబు నిర్ణయించారు. సంప్రదాయ ఓటు బ్యాంకును కాపాడుకుంటూ, పార్టీ వెన్నుదన్నైన బీసీలకు భరోసా ఇచ్చేలా మహానాడును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తే అధినేత అనేది ప్రతిబింబించేలా శ్రేణులందరినీ భాగస్వాములను చేస్తూ, సరికొత్త ఉత్సాహంతో ఈ వేడుకను పండుగలా నిర్వహిద్దామని పిలుపునిచ్చారు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం అధినేత చంద్రబాబు అధ్యక్షతన జరిగిన పొలిట్ బ్యూరో సమావేశంలో "మహానాడు-2026" నిర్వహణ ప్రధాన అజెండాగా కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈసారి "స్త్రీ శక్తి" ప్రధాన థీమ్‌గా 2026 మహానాడును నిర్వహించాలని పొలిట్ బ్యూరో నిర్ణయించింది. పార్టీ ఆవిర్భావం నాటి నుంచి నేటి వరకు మహిళా సంక్షేమం, సాధికారత కోసం దేశంలోనే ఆదర్శంగా నిలిచేలా టీడీపీ చేపట్టిన విప్లవాత్మక పథకాలపై ఈ వేదికగా విస్తృతంగా చర్చించనున్నారు.

"కార్యకర్తే పార్టీకి అసలైన అధినేత" : ప్రభుత్వ పథకాల రూపకల్పనలో మహిళల భాగస్వామ్యానికి ఇస్తున్న ప్రాధాన్యతను ప్రజలందరికీ అర్థమయ్యేలా చాటిచెప్పాలని - మిగతా 2 లో

# మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ..

## ఆయుధాలతో సహా లొంగిపోయిన 25 మంది మావోలు






2 లో

- ఝార్ఖండ్ డీజీపీ సమక్షంలో లొంగిపోయిన 25 మంది మావోయిస్టులు
- లైట్ మెషీన్ గన్స్ సహా పలు రకాల ఆయుధాల అప్పగింత
- అందరికీ పూర్తి పునరావాసం కల్పిస్తామన్న డీజీపీ

**ఢిల్లీ :**
ఝార్ఖండ్‌లో మావోయిస్టు ఉద్యమానికి కోలుకోలేని మరో దెబ్బ తగిలింది. 25 మంది మావోయిస్టులు ఆయుధాలతో సహా పోలీసుల ఎదుట లొంగిపోయారు. రాష్ట్ర డీజీపీ సమక్షంలో వీరు జనజీవన స్రవంతిలో కలిసిపోయారు. లొంగిపోయిన వారిలో ఆరుగురు సబ్ జోనల్ కమాండర్లు, - మిగతా 2 లో

## అసోం అసెంబ్లీలో ఆసక్తికర ఘటన.. మమతా బెనర్జీకి అనుకూలంగా నినాదాలు




2 లో

- ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకార సమయంలో "మమతా దీదీ జిందాబాద్" అంటూ నినాదాలు
- మండియా నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన అష్మద్
- ఎన్నికలకు కొన్నిరోజుల ముందు టీఎంసీలో చేరిక

**ఢిల్లీ :**
అసోం శాసనసభ తొలిరోజు కొత్తగా ఎన్నికైన 126 మంది ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారానికి సిద్ధమైన సమయంలో నాటకీయ పరి మాణం చోటుచేసుకుంది. తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఒకరర "మమతా దీదీ జిందాబాద్" అని నినాదాలు చేయడం కలకలం రేపింది. ప్రొటెం స్పీకర్ చంద్రమోహన్ పటోవరీ, అసెంబ్లీ సెక్రటేరియట్ అధికారుల పర్య వేక్షణలో 126 మంది ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీ కారం చేశారు. అయితే తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) నుండి ఎన్నికైన ఏకైక - మిగతా 2 లో

## 48.1 డిగ్రీలు... పిడుగురాళ్లలో రాళ్లు పగిలే ఎండ!





- నిప్పుల కొలిమిలా ఏపీ
- పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో 48.1 డిగ్రీల రికార్డు ఉష్ణోగ్రత
- పలు జిల్లాల్లో 47 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- రాష్ట్రంలోని 200 మండలాల్లో 44 డిగ్రీలకు పైగా నమోదు
- వచ్చే సోమవారం వరకు ఎండల తీవ్రత కొనసాగుతుందని హెచ్చరిక

## అమెరికాలో వృద్ధులే టార్గెట్... భారత కాల్ సెంటర్ మూసివేత

- వందలాది వృద్ధుల నుంచి మిలియన్ల కొద్ది డాలర్ల దోపిడీ
- మియామీకి చెందిన టెలి కమ్యూనికేషన్స్ ద్వారా మోసం
- ఆరేళ్ళ క్రితం దర్యాప్తు ప్రారంభం.. బయటకొచ్చిన భారతీయుల పేర్లు



**ఢిల్లీ :**
అమెరికా, విదేశాల్లోని వృద్ధుల నుంచి లక్షలాది డాలర్లను దోచుకుంటున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న భారత్ నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఒక కాల్ సెంటర్ నెట్ వర్క్ ను అమెరికా అధికారులు మూసివేయించారు. వందలాదిమంది వృద్ధుల నుంచి మిలియన్ల కొద్దీ డాలర్లను - మిగతా 2 లో

జాతీయ పత్రిక ఆదిత్య
JATIYAPATRIKA ADITHIYA TELUGU DAILY RNI No : APTEL/25/A2560
మానవసేవయే.... మాధవసేవ
ఎడిటర్ : యార్లపాటి శ్రీధర్
శుక్రవారం 22 మే 2026

# సంపాదకీయం

## పశ్చిమాసియా కల్లోలంలో భారత్ అభివృద్ధి

మధ్యప్రాచ్య దేశాలలో తరచూ యుద్ధ ఉద్రిక్తతలు నెలకొనడం పరిపాటి. ఈ దేశాల చమురు ఉత్పత్తులపై ఆధారపడ్డ దేశాలు, మరీ ముఖ్యంగా భారత్ యుద్ధ పరిస్థితులు తలెత్తిన ప్రతిసారీ తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంటుంది. ఇప్పుడూ అదే జరుగుతోంది. భారత్‌కు ఈ అవస్థలు అనివార్యం. అరబ్ దేశాలు, ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు ఉత్పన్నమైన ప్రతిసారీ చమురు ధరలు పెరుగుతాయి. వెన్నంటనే ద్రవ్యోల్బణం ముమ్మరమవుతుంది. భారత ఆర్థిక వ్యవస్థ పురోగతికి విఘాతం వాటిల్లుతుంది. 1971లో పాకిస్థాన్‌తో యుద్ధం, పిమ్మట రెండేళ్ళు దేశవ్యాప్తంగా తీవ్ర దుర్భిక్షం. గోరుచుట్టుపై రోకటిపోటులా 1973లో అరబ్బు దేశాలుఇజ్రాయెల్ మధ్య యుద్ధంతో చమురు ధరలు పెరుగుదల. ఇలాంటి ప్రతికూల పరిస్థితులలో భారత్ అల్లాడిపోయింది. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం ఆకలిదాడులకు దారితీసిన పరిస్థితులపై ప్రఖ్యాత నటుడు మనోజ్‌కుమార్ 'రోటీ కపడా ఔర్ మకాన్' అనే సినిమా నిర్మించారు. ఈ దేశభక్తి ప్రధాన సినిమాను ఆ తరం వారు విశేషంగా ఆదరించారు. 1970ల్లో బాక్సాఫీసు బద్దలుకొట్టిన బాలీవుడ్ సినిమాలలో అదొకటి. ప్రస్తుతం ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికాఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధ పరిణామాలను గమనిస్తుంటే, నాటి పరిస్థితులు గుర్తుకు వస్తున్నాయి. 1973లో అరబ్ఇజ్రాయెల్ యుద్ధానికి ముందు చమురు పీపా ధర 1.5 డాలర్లు. మధ్యప్రాచ్యంలో యుద్ధాగ్నులు ప్రజ్వరిల్లిన ప్రతిసారీ చమురు ధర సైతం తప్పనిసరిగా అధికమవుతుంది. ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం(1979) సంభవించిన తరువాత చమురు పీపా ధర 35 డాలర్లకు పెరిగింది! 1991లో మొదటి గల్ఫ్ యుద్ధం నాటి నుంచి ప్రస్తుత ఇరాన్ యుద్ధం వరకు చమురు ధర పలుమార్లు పెరిగింది. ధర పెరిగిన ప్రతిసారీ భారత్ ఆర్థిక పురోగతి ప్రమాదంలో పడుతూ వస్తోందని మరి చెప్పనవసరం లేదు. 1973 ఇజ్రాయెల్ యుద్ధం తాకిడిని చవిచూసిన తరువాత ప్రత్యామ్నాయ మార్గాలపై భారత ప్రభుత్వం దృష్టి పెట్టింది. అందులో భాగంగా బొగ్గు ఉత్పత్తిని పెంచింది. 1990వ దశకంలో సరళీకృత ఆర్థిక విధానాలతో పారిశ్రామికాభివృద్ధి ఇతోధికమయిన కారణంగా చమురు, సహజ వాయువు అవసరాలు మున్నెన్నడు లేని విధంగా పెరిగిపోయాయి. వాటి దిగుమతులపై ఆధారపడటమూ అనివార్యంగా పెరిగిపోయింది. కీలకమైన విద్యుత్ ఉత్పత్తి రంగంలో కాలుష్యకారక వాయు ఉద్గారాలను నియంత్రించేందుకు బొగ్గు వినియోగాన్ని తగ్గిస్తూ క్రమేణా సహజవాయువు వినియోగాన్ని అధికం చేశారు. అయితే విద్యుదుత్పాదనకు వినియోగిస్తున్న సహజవాయువు విదేశాల నుంచి దిగుమతి చేసుకునేదే కావడం గమనార్హం. చమురు వినియోగంలో రవాణా రంగానిది ప్రథమ స్థానం. రవాణా కార్యకలాపాలలో సహజవాయువు వినియోగం ఆశించిన విధంగా పెరగలేదు. రైల్వేస్‌లో సైతం డీజిల్ వినియోగం ఎక్కువే అయినా 90శాతానికి పైగా రైల్వే లైన్లు విద్యుదీకరణ కావడంతో ఆ చమురు వినియోగం 62శాతానికి తగ్గింది. విద్యుదుత్పాదనలో సహజవాయువుకు ప్రాధాన్యం అంతకంతకూ పెరిగిపోతోంది. వ్యవసాయ రంగంలో సన్నకారు రైతులు సాగు బావులకు విద్యుత్ పంపు సెట్లు అందించడం ద్వారా గ్రామీణ విద్యుత్ సరఫరాకు ఊతమివ్వడం డీజిల్ వినియోగాన్ని తగ్గించడంలో భాగమే. గ్రామీణ సహకార విద్యుత్ సరఫరాలో సుప్రసిద్ధమైన సిరిసిల్లలోని 'సెస్'లో 70శాతం విద్యుత్ వ్యవసాయ రంగానికే వినియోగమవుతున్నది. అనేక రాష్ట్రాలలో వ్యవసాయ పంపుసెట్లు ఇప్పటికీ డీజిల్‌పై ఆధారపడి ఉండగా ఎరువుల కర్మాగారాలు గ్యాస్ ఆధారితంగా ఉన్నాయి. ఎరువుల ఉత్పత్తికి అవసరమైన రసాయనాలు సైతం గల్ఫ్ దేశాల నుంచే దిగుమతి అవుతున్నాయని విషయం విస్మరించరానిది. భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి అనేది దిగుమతి చేసుకుంటున్న చమురు ధరలపై ఆధారపడి ఉన్నది. ఇరాన్, ఇజ్రాయెల్, అరబ్ దేశాలు, అమెరికా రాజకీయాలు, సైనిక సమీకరణలు, భౌగోళిక పరిస్థితుల కారణంగా ఉత్పత్తి, సరఫరాలో ఏ కొద్దిపాటి అంతరాయం ఏర్పడినా భారత ఆర్థిక వ్యవస్థను అది ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. అరేబియా సముద్ర తీరస్థ ఇరాన్, అరబ్ దేశాల నుంచే కాకుండా అమెరికా, రష్యా నుంచి సైతం భారత్ తనకు అవసరమైన చమురును దిగుమతి చేసుకుంటోంది. గల్ఫ్ నుంచి భారత్‌కు చమురు రవాణా ఖర్చు పీపాకు ఒక డాలర్ లోపు కాగా అమెరికా నుంచి ఆ రవాణా ఖర్చు 14.50 డాలర్లు. పైగా రవాణాకు పట్టే సమయమూ అధికమే. రష్యా నుంచి దిగుమతి చేసుకున్న చమురును స్థానిక విపణిలో విక్రయించకుండా విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. అరేబియా సముద్ర తీరస్థ ఎనిమిది దేశాలు భారత్‌కు చమురు సరఫరా చేస్తున్నాయి. అదే అమెరికా నుంచి దిగుమతి చేసుకోవడానికి ప్రాధాన్యమిస్తే మార్కెట్ ఆధిపత్య ధోరణితో వ్యవహరించే ఆ ఒక్క దేశంపై మాత్రమే ఆధారపడవల్సి ఉంటుంది. మధ్యప్రాచ్యంలోని సున్నిత ధార్మిక, రాజకీయ అంశాలకు తోడుగా సైనిక సమీకరణలు, దౌత్య వ్యవహారాల విభిన్న సవాళ్ళ మధ్య భారత్ ఆచితూచి అడుగులు వేస్తోంది. ఇక్కడ ఎక్కడా కూడా ఏ ఒక్క మాట తూలినా, తప్పటడుగు వేసినా భారత ఆర్థిక వ్యవస్థ భారీ మూల్యం చెల్లించుకోవల్సివస్తుంది.

# కనీస వేతనాలు భారీగా పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం

**మొదటిపేజీ తరువాయి -** జూన్ 1 నుంచి పెంచిన వేతనాలు అమల్లోకి రానున్నాయి. రాష్ట్రాన్ని ప్రభుత్వం మూడు జోన్లుగా విభజించింది.

కార్మికుల వేతనాల పెంపు ఇలా : బీఆర్ఎస్? ప్రభుత్వ హయాంలో కార్మికుల కనీస వేతనాలు నిర్ణయించకపోవడం వల్ల 1.11 కోట్ల మంది కార్మికులు నష్టపోయారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. కనీస వేతన పెంపుపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం అన్ని వర్గాలతో సంప్రదింపులు జరిపి పలు కీలక సిఫార్సులు చేసిందని వివరించారు. కార్మికులు సంతృప్తిగా ఉన్నప్పుడే ఉత్పత్తి బాగుంటుందన్నారు. అన్?స్కిల్, సెమీ స్కిల్, హైస్కిల్ కేటగిరీలుగా విభజించిందన్నారు. కార్మికుల వేతనాలు నిర్ణయించేందుకు గాను జోన్లను 3 జోన్లుగా విభజించామని తెలిపారు.

జోన్?-1లో మున్సిపల్ కార్పొరేషన్లు. జోన్?-2 మున్సిపాల్టీలు. జోన్?-3 కింద గ్రామీణ ప్రాంతాలు ఉంటాయని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. జోన్?-1లో అన్?స్కిల్డ్? కార్మికుల వేతనంను రూ.12,750 నుంచి రూ.16వేలకు, సెమీ స్కిల్డ్? కార్మికుల వేతనం రూ. 13,592 నుంచి రూ.17వేలకు, స్కిల్డ్? కార్మికుల వేతనం రూ.రూ.13,772 నుంచి రూ.18,500కి, హై స్కిల్డ్? కార్మికులకు సంబంధించి రూ.14,607 నుంచి రూ.20 వేలకు పెంచామని వెల్లడించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం జూన్? నెల ఒకటో తేదీ నుంచి అమల్లోకి వస్తుందని చెప్పారు.

విదేశీ ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవాలి : స్కిల్స్? పెంచుకునేందుకు అవసరమైన ప్రోత్సాహకాలను ఇస్తున్నామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నైపుణ్యాలు పెంచుకుంటేనే విదేశాల్లో రూ.2లక్షల వరకు వేతనం ఉంటుందని వివరించారు. ఉద్యోగం, ఉపాధి అవకాశాలు కల్పించలేని చదువులు వ్యర్థమని ఆయన అభిప్రాయపడ్డారు. జర్మనీ, జపాన్, సింగపూర్‌లలో ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, రాష్ట్ర యువత స్కిల్స్ పెంచుకొని విదేశీ ఉద్యోగాలను అందిపుచ్చుకోవాలని రేవంత్ రెడ్డి సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల వైట్‌కాలర్ ఉద్యోగాలకే ముప్పు అని బ్లూ కాలర్ ఉద్యోగాలకు ఉండదన్నారు. నైపుణ్యాలు ఉన్న వారు కావాలని విదేశాలు తమను సంప్రదిస్తున్నాయని రేవంత్ రెడ్డి అన్నారు.

"ఏఐతో కోట్లాది ఉద్యోగాలకు ముప్పు వస్తోంది. జర్మనీ, జపాన్, సింగపూర్‌లో ఎన్నో ఉద్యోగాలు ఉన్నాయి. రాష్ట్ర యువత స్కిల్స్ పెంచుకొని విదేశీ ఉద్యోగాలను అందిపుచ్చుకోవాలి. ఏఐ వచ్చినా బ్లూకాలర్ ఉద్యోగాలకు ముప్పు ఉండదు. నైపుణ్యాలు ఉన్నవారు కావాలని విదేశాలు మమ్మల్ని సంప్రదిస్తున్నాయి. స్కిల్స్ పెంచుకునేందుకు అవసరమైన ప్రోత్సాహకాలను ఇస్తున్నాం. ఏఐ వచ్చినా బ్లూకాలర్ ఉద్యోగాలకు ముప్పు ఉండదు. నైపుణ్యాలు పెంచుకుంటే విదేశాల్లో రూ.2 లక్షల వరకు వేతనం ఉంటుంది. నైపుణ్యాలు పెంచేందుకు ఏటీసీ విద్యార్థులకు నెలకు రూ.2 వేలు ఇస్తున్నాం"- రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి

గత ప్రభుత్వ హయాంలో హయాంలో కనీస వేతన సవరణ చేయలేదు : బీఆర్ఎస్? హయాంలో కనీస వేతన సవరణ చేయలేదని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. కార్మికులు సంతృప్తిగా ఉన్నపుడు మాత్రమే ఉత్పత్తి బాగుంటుందని అభిప్రాయపడ్డారు. వేతనాల సవరణకు సీఎం రేవంత్ రెడ్డి ఒక కేబినెట్ సబ్? కమిటీని ఏర్పాటు చేశారని వివరించారు. కనీస వేతన సవరణ ప్రభావం 1.11 కోట్ల మందిపై ఉంటుందని తెలిపారు.

# "కార్యకర్తే పార్టీకి అసలైన అధినేత"

**మొదటిపేజీ తరువాయి -** చంద్రబాబు స్పష్టం చేశారు. "కార్యకర్తే పార్టీకి అసలైన అధినేత" అనే బలమైన సందేశం ఈ మహానాడు వేదికగా ప్రతి ఒక్కరికీ చేరాలని దిశానిర్దేశం చేశారు. డిజిటల్, భౌతిక రూపాల కలయికతో హైబ్రిడ్ విధానంలో ఈ ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రోజువారీ సమయపాలనకు పెద్దపీట వేస్తూ, రెండు రోజుల పాటు ఉదయం 9 గంటలకే మహానాడు కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. క్షేత్రస్థాయి శ్రేణులను ఉత్తేజితం చేస్తూ ప్రతి ఒక్కరినీ ఈ వేడుకలో భాగస్వాములను చేయాలని అధినేత ఆదేశించారు.

మహానాడు నిర్వహణను కేవలం ఒకే ప్రాంతానికి పరిమితం చేయకుండా గ్రామాల్లోని క్లస్టర్ స్థాయిలోనే నిర్వహించాలని పొలిట్ బ్యూరో ఖరారు చేసింది. అన్ని క్లస్టర్లలో తెలుగువారి ఆరాధ్యదైవం, నందమూరి తారకరామారావు విగ్రహాలకు ఘనంగా నివాళులర్పించి కార్యక్రమాలను ప్రారంభిస్తారు. మహానాడుకు రెండు రోజుల ముందు నుంచే పండుగ వాతావరణం ప్రతిబింబించేలా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి కార్యకర్త, అభిమాని ఇంటిపై టీడీపీ జెండాను రెపరెపలాడించాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.

మొత్తం 19 తీర్మానాలకు ఆమోదం : పార్టీ భవిష్యత్తు కార్యాచరణను నిర్దేశించేలా పొలిట్ బ్యూరో సమావేశంలో మొత్తం 19 తీర్మానాలకు ఆమోదం తెలిపారు. వీటితో పాటు మహానాడులో చర్చకు రానున్న వివిధ అంశాలపై చంద్రబాబు పలు కీలక సూచనలు చేశారు. ప్రసంగించే ప్రతి వక్తా తమకు కేటాయించిన అంశంపై పూర్తి నిష్ణాతుడై ఉండాలని, ఎలాంటి సాగతీత లేకుండా, సమయపాలన పాటిస్తూ విషయాన్ని సూటిగా, స్పష్టంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆదేశించారు. ఈ మహానాడులో విభిన్న ప్రాంతాల సమస్యలు, రాజకీయ ముఖచిత్రంపై సుదీర్ఘంగా చర్చించనున్నారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి 10, తెలంగాణకు సంబంధించి 4, అండమాన్‌కు చెందిన 1 అంశంతో పాటు ఉమ్మడి అంశాలపై మరో 4 తీర్మానాలను ప్రవేశపెట్టనున్నారు. వీటికి తోడు రెండు రాష్ట్రాల్లోని తాజా రాజకీయ పరిస్థితులు, సవాళ్లపై ప్రత్యేక రాజకీయ తీర్మానం రూపంలో చర్చ జరగనుంది. పార్టీ ఆవిర్భావం నుంచి జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలు తెలుగుదేశానికి కొండంత అండగా నిలిచారని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా గుర్తుచేశారు. బీసీల సర్వతోముఖాభివృద్ధికి, ఆర్థిక ఎదుగుదలకు పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందనే బలమైన సందేశాన్ని ఈ మహానాడు ద్వారా క్యాడర్‌లోకి పంపనున్నారు. పార్టీకి ఉన్న సాంప్రదాయ ఓటు బ్యాంకును ఎక్కడా చేజారిపోకుండా జాగ్రత్తగా కాపాడుకోవాలని నేతలకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, తీసుకొస్తున్న భారీ పెట్టుబడులు, సాధిస్తున్న ప్రగతిని మహానాడు వేదికగా ప్రజల ముందుకు తీసుకురానున్నారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటూ 'గొడ్డలి పార్టీ' సాగిస్తున్న కుట్రలను, విధ్వంసకర రాజకీయాలను ఈ వేదికగా ఎండగట్టాలని పొలిట్ బ్యూరో నిర్ణయించింది. "నా దేశం-నా బాధ్యత" నినాదంతో చేపట్టాల్సిన పొదుపు చర్యలపై కూడా ఈ మహానాడులో ప్రత్యేకంగా చర్చించనున్నారు.

## నారా లోకేష్ నేతృత్వంలోని కమిటీకి చంద్రబాబు దిశానిర్దేశం

**మొదటిపేజీ తరువాయి -** (ఎంవోయూలు), రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) ఆమోదించిన ప్రాజెక్టుల పురోగతిపై ఆయన గురువారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి నారా లోకేష్ నేతృత్వంలోని మంత్రుల కమిటీకి సీఎం దిశానిర్దేశం చేశారు. ఇప్పటివరకు ఎస్ఐపీబీ ద్వారా రూ.11.47 లక్షల కోట్ల పెట్టుబడులతో 282 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపామని చంద్రబాబు గుర్తుచేశారు. వీటిలో 114 ప్రాజెక్టులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని (గ్రౌండింగ్ అయ్యాయని) అధికారులు సమావేశంలో వివరించారు. మిగిలిన ప్రాజెక్టుల విషయంలో జాప్యం జరగకుండా చూడాలని సీఎం స్పష్టం చేశారు. వాటికి అవసరమైన అనుమతులు, భూ కేటాయింపుల ప్రక్రియను వేగవంతం చేసి, అవి కూడా త్వరగా గ్రౌండింగ్‌కు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడి అవకాశాలను సద్వినియోగం చేసుకోవడంపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్, బీసీ జనార్దన్ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తమిళనాడులో 59 ఏళ్ల తర్వాత
## కాంగ్రెస్‌కు మంత్రి పదవి.. ప్రమాణ స్వీకారంలో ఆసక్తికర ఘటన

**మొదటిపేజీ తరువాయి -** ప్రమాణం ముగిశాక పార్టీ నేతల పేర్లతో నినాదాలు చేయగా, గవర్నర్ చిరునవ్వుతోనే సున్నితంగా హెచ్చరించారు.నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వంలో కాంగ్రెస్ శాసనసభా పక్ష నేత, కిళియూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ఎస్. రాజేశ్ కుమార్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ పత్రంలోని వాక్యాలు చదివి పూర్తిచేసిన వెంటనే ఆయన, "కామరాజ్ నామం వర్ధిల్లాలి, భారతరత్న రాజీవ్ గాంధీ వర్ధిల్లాలి, ప్రజా నేత రాహుల్ గాంధీ వర్ధిల్లాలి" అంటూ నినాదాలు చేశారు. దీంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ వెంటనే స్పందించారు. "అది మీ ప్రమాణంలో భాగం కాదు" అని చిరునవ్వుతో చురక అంటించారు. గవర్నర్ వ్యాఖ్యకు రాజేశ్ కుమార్ కూడా నవ్వుతూనే బదులిచ్చి, పత్రాలపై సంతకం చేసేందుకు ముందుకు వెళ్లారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 1967 తర్వాత తమిళనాడు ప్రభుత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారం పంచుకోవడం ఇదే ప్రథమం. ఇటీవలి ఎన్నికల్లో విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీకి మెజారిటీకి కొద్ది సీట్లు తక్కువయ్యాయి. ఈ క్రమంలో 20 ఏళ్లుగా మిత్రపక్షంగా ఉన్న డీఎంకేతో బంధం తెంచుకుని, టీవీకే ప్రభుత్వానికి ఐదుగురు ఎమ్మెల్యేలున్న కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది. డీఎంకే మిత్రపక్షంగా ఉన్నప్పటికీ గతంలో వారి మంత్రివర్గంలో కాంగ్రెస్‌కు ఎప్పుడూ చోటు దక్కలేదు. మే 10న విజయ్ తొమ్మిది మంది మంత్రులతో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయగా, గురువారం జరిగిన మంత్రివర్గ విస్తరణలో ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో పాటు 21 మంది టీవీకే ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణం చేశారు. దీంతో రాష్ట్రంలో కొత్త రాజకీయ సమీకరణాలు మొదలయ్యాయి.

## 'మావిగన్'ను ప్రతిపాదించింది అందుకే: జగన్

**మొదటిపేజీ తరువాయి -** 'మావిగన్' పేరు ఎత్తితేనే చంద్రబాబుకు గుండె ఆగిపోయేలా ఉందని, భయంతో మంత్రులతో బూతులు మాట్లాడిస్తున్నారని జగన్ విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా... సున్నా నుంచి ప్రారంభించాల్సిన అమరావతి కంటే, ఇప్పటికే అన్ని సదుపాయాలు ఉన్న 'మావిగన్' ప్రాంతాన్ని ప్రత్యామ్నాయంగా చూపించామని జగన్ స్పష్టం చేశారు. ప్రజలు కూడా తమ ప్రతిపాదనకు మద్దతు పలికారని, ఆ వాస్తవాన్ని తట్టుకోలేకనే చంద్రబాబు తనపై, వైసీపీపై బురద జల్లుతున్నారని వైఎస్ జగన్ విమర్శించారు. అమరావతిలో కేవలం రోడ్లు, నీరు, డ్రైనేజీ వంటి ప్రాథమిక మౌలిక సదుపాయాలకే రూ. 2 లక్షల కోట్లు ఖర్చవుతుందని.. రాజధాని నిర్మాణం ఆచరణ సాధ్యం కాదని తెలిసినా చంద్రబాబు కేవలం స్కామ్‌ల కోసమే ముందుకు వెళుతున్నారని ఆరోపించారు. ఇప్పటికే అమరావతి పేరుతో రూ. 47,387 కోట్లు అప్పు చేశారని, ఖజానా నుంచి మరో రూ. 9,200 కోట్లు ఖర్చు చేస్తూ రాష్ట్ర ప్రజల వెన్ను విరుస్తున్నారని మండిపడ్డారు. అమరావతిలో ఇప్పటికే రూ. 1,200 కోట్లతో నిర్మించిన అసెంబ్లీ, హైకోర్టు, సెక్రటేరియట్ తాత్కాలిక భవనాలు ఉన్నప్పటికీ, మళ్లీ కొత్తగా కడతామనడం విచ్చలవిడి దోపిడీకి నిదర్శనమన్నారు. కొత్తగా నిర్మించ తలపెట్టిన 5 బిల్డింగ్‌ల అంచనాలను జగన్ ప్రశ్నించారు. ఈ ఐదు బిల్డింగుల డిజైన్లకే రూ. 401 కోట్లు తగలేశారని, మొత్తం నిర్మాణ ఖర్చు రూ. 10,665 కోట్లుగా చూపించారని లెక్కలు కట్టారు. "ప్రస్తుత అంచనాల ప్రకారం చదరపు అడుగుకు నిర్మాణ వ్యయం రూ. 20,427 అవుతోంది. దీనికి ఫర్నీచర్, ఇంటీరియర్ ఖర్చులు కూడా కలిపితే చదరపు అడుగుకు రూ. 30 వేలు దాటుతుంది. ఫైవ్‌స్టార్ హోటళ్ల నిర్మాణానికే చదరపు అడుగుకు రూ. 4,500 లోపు ఖర్చవుతుంటే, ఇక్కడ ఇంత భారీ ఖర్చు దేనికి?" అని జగన్ నిలదీశారు. పొరుగు రాష్ట్రమైన తెలంగాణలో కేసీఆర్ కేవలం రూ. 615 కోట్లతోనే అత్యంత ఆధునిక సచివాలయాన్ని నిర్మించారని, కానీ ఏపీలో మాత్రం కొత్త టెండర్ల పేరుతో పాత కాంట్రాక్టర్లకే పనులు ఇస్తూ ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు.

## భగీరథ్‌ను అప్పగించలేదు.. పోలీసులే అరెస్ట్ చేశారు

**మొదటిపేజీ తరువాయి -** తీసుకున్నారని తెలిపారు. తనకు పోలీసులు ఇచ్చిన సమాచారం ఇదేనని.. వారి మాటలనే తాను నమ్ముతానని పేర్కొన్నారు.

### అది సరెండర్ ఎలా అవుతుంది?

బండి సంజయ్ తన కుమారుడిని పోలీసులకు అప్పగించారనే ప్రచారాన్ని ముఖ్యమంత్రి ఖండించారు. ఒకవేళ ఆయనే అప్పగించాలనుకుంటే పోలీసులను ఇంటికి పిలిచి అప్పగించాల్సిందని అభిప్రాయపడ్డారు. రోడ్డు మధ్యలో ఉన్న అప్పా జంక్షన్ వద్ద పోలీసులు పట్టుకుంటే అది సరెండర్ ఎలా అవుతుందని ప్రశ్నించారు. అప్పా జంక్షన్ ఏమైనా బండి సంజయ్ ఇల్లా? అని నిలదీశారు.

### బాలిక విషయంలో రాజకీయం వద్దు

ఫిర్యాదు అందిన వెంటనే ప్రభుత్వం పద్ధతి ప్రకారం చర్యలు తీసుకుందని రేవంత్ రెడ్డి వివరించారు. ఈ సున్నితమైన కేసులో బీఆర్ఎస్ నాయకులు సిగ్గు తప్పి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వారే విచారణ జరిపి, వాళ్లే తీర్పులు ఇచ్చుకుంటున్నారని ధ్వజమెత్తారు. పోక్సో కేసులో మైనర్ బాలిక వివరాలు వెల్లడిస్తే ఆ కుటుంబానికి ఎంతో ఇబ్బంది కలుగుతుందని, కేటీఆర్ రాజకీయాల కోసం ఒక బాలికను అడ్డుపెట్టుకోవడం సరికాదన్నారు.

## అమెరికాలో వృద్ధులే టార్గెట్... భారత కాల్ సెంటర్ మూసివేత

**మొదటిపేజీ తరువాయి -** ఈ సంస్థ దోచుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనికి సంబంధించి ఏళ్ళ తరబడి దర్యాప్తు చేసిన ఎఫ్‌బీఐ ఐదుగురు టెలీమార్కెటింగ్ మోసగాళ్ల నేరాలను నిరూపించింది. ఈ మేరకు బోస్టన్‌లోని ఎఫ్‌బీఐ ప్రకటించింది. మయామీకి చెందిన ఆడమ్ యంగ్, లాస్ వెగాస్‌కు చెందిన హారిసన్ గెవిర్జ్ టెలికమ్యూనికేషన్ సంబంధిత సేవలను అందించే సంస్థను నడుపుతున్నారు. ఆ కంపెనీ కాల్ రూటింగ్, టెలిఫోన్ నెంబర్స్, కాల్ ట్రాకింగ్, కాల్ ఫార్వార్డ్ సర్వీసులు అందిస్తుంది. అయితే, ఈ సంస్థ సేవలను వాడుకుని భారతదేశానికి చెందిన కాల్ సెంటర్లు మోసాలకు పాల్పడుతున్నట్లు అధికారులు తెలిపారు. తమ సంస్థలో మోసాలు జరుగుతున్నట్లు యంగ్, హారిసన్లకు తెలుసు. ఆరేళ్ల క్రితం దర్యాప్తు ప్రారంభం కాగా, మరో ఐదుగురు భారతీయుల పేర్లు బయటకు వచ్చాయి. వీరంతా అమెరికన్లను లక్ష్యంగా చేసుకుని, భారత్ కేంద్రంగా టెలీ మార్కెటింగ్ మోసాలకు పాల్పడుతున్నట్లు దర్యాప్తులో గుర్తించారు. జగ్మీత్ సింగ్ విర్క్ అనే వ్యక్తిపై కూడా నేరం నిరూపణ అయినట్లు ఎఫ్‌బీఐ వెల్లడించింది.

## మహానాడు ఎలా జరుపుదాం?...
## పార్టీ అగ్రనేతలతో చంద్రబాబు సమావేశం



టీడీపీ మహానాడు ఏర్పాట్లపై పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం పొలిట్‌బ్యూరో సమావేశం జరిగింది. మే 27, 28 తేదీల్లో హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహించనున్న ఈ కార్యక్రమ అజెండాపై నేతలకు చంద్రబాబు కీలక దిశానిర్దేశం చేశారు. హైబ్రిడ్ విధానంలో నిర్వహించే మహానాడును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం కోసం రూపొందించిన 19 తీర్మానాలకు పొలిట్‌బ్యూరో ఆమోదం తెలిపింది. ఉండవల్లిలోని తన నివాసం నుంచి చంద్రబాబు వర్చువల్‌గా పాల్గొనగా, ఇతర నేతలు మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్ నుంచి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఉదయం 9 గంటల నుంచే కార్యక్రమాలు ప్రారంభించాలని, ప్రతి వక్త తమకు కేటాయించిన అంశంపైనే సూటిగా, స్పష్టంగా మాట్లాడాలని చంద్రబాబు ఆదేశించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. పార్టీకి మహిళలు, బీసీలు రెండు కళ్ల లాంటివారని పునరుద్ఘాటించారు. "మహిళలకు టీడీపీ ఇస్తున్న ప్రాధాన్యాన్ని అందరికీ అర్థమయ్యేలా చాటాలి. జనాభాలో 50 శాతం ఉన్న బీసీలు పార్టీ ఆవిర్భావం నుంచీ మనకు వెన్నుదన్నుగా ఉన్నారు. వారి అభివృద్ధికి పార్టీ కట్టుబడి ఉందనే సందేశం స్పష్టంగా వెళ్లాలి" అని నేతలకు సూచించారు. "కార్యకర్తే అధినేత" అనే నినాదం మహానాడులో స్పష్టంగా ప్రతిబింబించాలని, పార్టీ సంప్రదాయ ఓటు బ్యాంకును జాగ్రత్తగా కాపాడుకోవాలని స్పష్టం చేశారు. కాగా, ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పొదుపు మంత్రం నేపథ్యంలో, ఈసారి మహానాడును మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్ నుంచి హైబ్రిడ్ విధానంలో నిర్వహించాలని నిర్ణయించారు. పార్టీ అగ్రనేతలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక పైనుంచి ప్రసంగిస్తారు. పార్టీ క్యాడర్ కోసం రాష్ట్రవ్యాప్తంగా వందల సంఖ్యలో డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నారు.


# మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ..

**మొదటిపేజీ తరువాయి -** మరో ఆరుగురు ఏరియా కమాండర్లు, 13 మంది చురుకైన హార్డ్‌కోర్ సభ్యులు ఉన్నారు. వీరంతా సుదీర్ఘకాలంగా ఝార్ఖండ్‌లోని అత్యంత క్లిష్టమైన కోల్హాన్, దట్టమైన సరంద అటవీ ప్రాంతాలలో తమ సాయుధ కార్యకలాపాలను నిర్వహిస్తూ భద్రతా దళాలకు సవాలుగా మారారు. ఈ లొంగుబాటు సందర్భంగా మావోయిస్టులు భారీగా ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. ఇందులో ఎల్ఎమ్‌జీ, ఇన్సాస్ రైఫిళ్లు, ఎస్ఎల్ఆర్ లు, 303 రైఫిళ్లు, దేశవాళీ తుపాకులు ఉన్నాయి. లొంగిపోయిన వారిలో మహిళా మావోయిస్టులు కూడా ఉండటం గమనార్హం. 100కు పైగా తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉండి, సుదీర్ఘకాలంగా మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న టాప్ కమాండర్ సాగెన్ అంగారియా అలియాస్ డొకోల్ కూడా లొంగిపోయిన వారిలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఇంతటి కీలక నేతలు, కేడర్ ఒకేసారి ప్రధాన స్రవంతిలోకి రావడంతో ఝార్ఖండ్‌లో మావోయిస్టు పార్టీ నెట్‌వర్క్ పూర్తిగా బలహీనపడినట్లయింది. ఈ సందర్భంగా ఝార్ఖండ్ డీజీపీ మాట్లాడుతూ... రాష్ట్రంలో తీవ్రవాదాన్ని, నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు భద్రతా దళాలు సమష్టిగా, వ్యూహాత్మకంగా పనిచేస్తున్నాయని కొనియాడారు. హింసను వీడి వచ్చిన వీరందరికీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూర్తిస్థాయిలో పునరావాసం కల్పిస్తామని, సమాజంలో గౌరవప్రదంగా బతికేందుకు తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే, ఇంకా అడవుల్లో అజ్ఞాతంలో కొనసాగుతున్న మిగిలిన మావోయిస్టులు కూడా తక్షణమే హింసా మార్గాన్ని విడనాడి, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వాడుకుంటూ ప్రధాన స్రవంతిలోకి రావాలని సీఆర్పీఎఫ్ ఐజీ సాకేత్ సింగ్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

## అసోం అసెంబ్లీలో ఆసక్తికర ఘటన..
## మమతా బెనర్జీకి అనుకూలంగా నినాదాలు

**మొదటిపేజీ తరువాయి -** ఎమ్మెల్యే అయిన షెర్మాన్ అలీ అహ్మద్, తన ప్రమాణ స్వీకారం పూర్తైన తర్వాత టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీకి మద్దతుగా నినాదాలు చేశారు. మాండియా నియోజకవర్గం ఎమ్మెల్యే అయిన అహ్మద్, అసోం అసెంబ్లీ ఎన్నికలకు కొద్దిరోజుల ముందు టీఎంసీలో చేరారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన అహ్మద్‌ను పార్టీ వ్యతిరేక కార్యకలాపాల కారణంగా 2021లో కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేశారు. ఆయన ఈ ఏడాదిలో ఫిబ్రవరిలో రైజోర్ దళ్‌లో చేరి, మాండియా నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా నియమితులయ్యారు. అసెంబ్లీ ఎన్నికల పొత్తులో భాగంగా కాంగ్రెస్, రైజోర్ దళ్ మధ్య సీట్ల పంపకంపై ఒప్పందం కుదిరింది. దీంతో అహ్మద్‌కు సీట్ నిరాకరించారు. ఈ నేపథ్యంలో ఆయన మార్చి 21న టీఎంసీలో చేరి, మాండియా నుంచి పోటీ చేసి గెలుపొందారు. 'మమతా దీదీ జిందాబాద్' అని అసెంబ్లీలో చేసిన నినాదాలను ఎమ్మెల్యే అహ్మద్ సమర్థించుకున్నారు. చాలా పార్టీలు తనను నిరాకరించిన క్లిష్ట దశలో రాజకీయంగా అండగా నిలిచిన ఆమెకు బహిరంగంగా కృతజ్ఞతలు చెబుతున్నానని అన్నారు. అసోంలో టీఎంసీని బలోపేతం చేస్తామని, నాగావ్ లోక్‌సభ ఉప ఎన్నికలో గట్టి అభ్యర్థిని పోటీలో నిలుపుతామని ఆయన తెలిపారు.

## 48.1 డిగ్రీలు... పిడుగురాళ్లలో రాళ్లు పగిలే ఎండ!




**మొదటిపేజీ తరువాయి -** ఆంధ్రప్రదేశ్‌లో వేసవి తన ప్రతాపాన్ని తీవ్రస్థాయిలో చూపిస్తోంది. రాష్ట్రం అగ్నిగుండాన్ని తలపిస్తుండగా, పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పిడుగురాళ్లలో నిన్న 47.6 డిగ్రీలుగా నమోదైన ఉష్ణోగ్రత, ఇవాళ మరింత పెరిగి 48.1 డిగ్రీలకు చేరింది. రాష్ట్రంలో ఇదే అత్యధిక ఉష్ణోగ్రత కావడం గమనార్హం. ఇక ఇతర ప్రాంతాల్లోనూ భానుడు భగభగమంటున్నాడు. బాపట్ల జిల్లా వేటపాలెం, కృష్ణా జిల్లా నందివాడలో 47.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎన్టీఆర్ జిల్లా టి.గుడిపాడు, ప్రకాశం జిల్లా అద్దంకిలో 47.4 డిగ్రీలు, ఏలూరు జిల్లా అల్లిపల్లిలో 47.3 డిగ్రీలు, నెల్లూరు జిల్లా కావలిలో 46.4 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా గురువారం నాడు 18 జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో 45 డిగ్రీలకు పైగా, 20 జిల్లాల్లోని సుమారు 200 మండలాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ప్రజలకు కీలక సూచనలు చేసింది. వచ్చే సోమవారం వరకు రాష్ట్రంలో ఎండల తీవ్రత ఇదే విధంగా కొనసాగే అవకాశం ఉందని వెల్లడించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించింది.

# రేవంత్ కు కేటీఆర్ బహిరంగ లేఖ..

**మొదటిపేజీ తరువాయి -** తొమ్మిదిన్నరేళ్ల పాటు బీఆర్ఎస్ హయాంలో కొండంత ధైర్యంతో బతికిన సాగు రంగాన్ని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం కొద్ది నెలల్లోనే కన్నీటి సేద్యంగా మార్చేసిందని ఆయన ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా పంట అమ్ముకోవడానికి వచ్చిన రైతులు కొనుగోలు కేంద్రాల వద్దే వారాల తరబడి పడిగాపులు కాస్తూ, గుండెపగిలి కుప్పకూలుతున్నా ప్రభుత్వానికి కనీస సోయి లేదని కేటీఆర్ విమర్శించారు. ముఖ్యమంత్రి తన కుర్చీని కాపాడుకోవడానికి 70 సార్లు ఢిల్లీ చుట్టూ తిరగడంపై ఉన్న శ్రద్ధలో ఒక్క శాతం కూడా రైతులపై పెట్టడం లేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల వద్ద ఎండ తీవ్రతకు, వడదెబ్బకు తోడు ప్రభుత్వం చేస్తున్న ఆలస్యం వల్ల దాదాపు 10 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారని లేఖలో పేర్కొన్నారు. వరంగల్ నుంచి ఖమ్మం దాకా ఎక్కడ చూసినా రోజుకు కనీసం ఒక్క లారీ లోడ్ కూడా ఎత్తడం లేదని, అడపాదడపా కొనే చోట కూడా క్వింటాలుకు 10 కిలోల వరకు తరుగు తీస్తూ రైతుల కడుపు కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చివరికి గన్నీ బ్యాగుల కోసం రైతుల నుంచే రూ. 50 డిపాజిట్ వసూలు చేసే దుస్థితి తేవడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ మూడు నెలల ముందే ప్రణాళికలు వేసి, కరోనా కష్టకాలంలోనూ రైతుల కల్లాల వద్దకే వెళ్లి చివరి గింజ వరకు కొనుగోలు చేసేలా భరోసా ఇచ్చారని కేటీఆర్ నీపేర్కొన్నారు. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అకాల వర్షాల నుంచి పంటను కాపాడుకోవడానికి కనీసం టార్పాలిన్లు కూడా సమకూర్చలేకపోతోందని, దీనివల్ల రైతులు కళ్లముందే ధాన్యం కొట్టుకుపోతుంటే నిస్సాహాయ స్థితిలో ఉన్నారని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పంటలకు బోనస్ ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదని, కనీసం మద్దతు ధరకు కొనుగోళ్లు కూడా చేయలేకపోతే 60 లక్షల మంది రైతులకు ముఖ్యమంత్రి ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రోడ్డెక్కని రైతు, రాస్తారోకో జరగని రహదారి లేదన్న కేటీఆర్... ఇవాళ బూతులు తిడుతున్న రైతులే రేపు కాంగ్రెస్ సర్కారుకు వాతలు పెడతారని అన్నారు. అన్నదాతల చేతిలోనే ఈ ప్రభుత్వ కౌంట్‌డౌన్ మొదలైందని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల వద్ద ప్రాణాలు కోల్పోయిన రైతుల కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున నష్టపరిహారం ప్రకటించాలని, లేనిపక్షంలో చరిత్రలో రేవంత్ రెడ్డి ఎప్పటికీ ఒక 'రైతు ద్రోహి'గానే మిగిలిపోతారని హెచ్చరికలు చేశారు.

JATIYAPATRIKA ADITHIYA TELUGU DAILY
ఆదిత్య

శుక్రవారం 22 మే 2026

# అక్రమ మద్యం, నాటు సారాను సమూలంగా నిర్మూలించాలి







**నాటు సారా తయారీ మాన్పించి, వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించాలి**

**ప్రజల ఆరోగ్యం ముఖ్యం**

**పదే పదే సారా తయారు చేసే వారిపై పిడి చట్టం ప్రయోగించండి**

**రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు మరియు ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర**

కర్నూలు, ఆదిత్య న్యూస్ మే 21: అక్రమ మద్యం, నాటు సారాను సమూలంగా నిర్మూలించాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు మరియు ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో ఎక్సైజ్ శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బోర్డర్ జిల్లాలు, సరిహద్దు ప్రాంతాల నుండి మద్యం అక్రమ రవాణాను పూర్తిగా నియంత్రించాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా నాటు సారా తయారీ నిర్మూలనపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.. సెప్టెంబర్ నాటికి పాలసీ అయిపోతుందని, మరల ఫ్రెష్ పాలసీపై త్వరలోనే డైరెక్షన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. మద్యం షాపుల టైమింగ్స్ విషయంలో, ఎంఆర్పీ ధరల ఉల్లంఘనల విషయంలో ఎట్టి పరిస్థితుల్లో కూడా రాజీపడకూడదన్నారు. ప్రజల ఆరోగ్యం ముఖ్యం అని, దాన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులు పని చేయాలన్నారు. ఎన్ఫోర్స్‌మెంట్ పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో నాటుసారా తయారీ మానేసిన వారికి ప్రత్యామ్నయంగా ఉపాధి చాలా బాగా కల్పిస్తున్నారని మంత్రి జిల్లా యంత్రాంగాన్ని మనస్ఫూర్తిగా అభినందించారు. భవిష్యత్తులో కూడా దీన్ని కొనసాగించాలని మంత్రి అధికారులకు సూచించారు. పదే పదే సారా తయారు చేసే వారిపై పిడి చట్టం ప్రయోగించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి మాట్లాడుతూ జిల్లాలో అక్రమ మద్యం రవాణా, నాటు సారా తయారీ నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నాటుసారా తయారీ మానేసిన వారికి ఇప్పటికే 36 మందికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించడం జరిగిందన్నారు.. పెండింగ్ లో ఉన్న 50 మందికి కూడా నెల రోజుల లోపు ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్డీపీఎల్ (నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్) క్రైమ్ చాలా వరకు తగ్గిందని వాటిని మరింత తగ్గించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం ధరల ఎంఆర్‌పి ఉల్లంఘనలు, షాప్ టైమింగ్స్ ను క్షుణ్ణంగా పర్యవేక్షిస్తున్నామని, ఇంకా కొంచెం విజిలెన్స్ పెంచే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పునరావృత నేరస్థులు ఎవరైతే ఉన్నారో వారి మీద పీడీ కేసెస్ బుక్ చేస్తున్నామని, ముగ్గురి మీద పీడీ యాక్ట్ బుక్ చేయడం జరిగిందన్నారు.జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ ఎక్సైజ్ డిపార్ట్మెంట్ మరియు పోలీస్ డిపార్ట్మెంట్ ఇద్దరూ నిరంతర సమన్వయంతో పని చేస్తున్నామన్నారు. ముఖ్యంగా ఇంటర్-బోర్డర్ మూవ్‌మెంట్ లేదా ఐడీ లిక్కర్ (ఇల్లీగల్ లిక్కర్) ఎన్ఫోర్స్‌మెంట్, అలాగే గంజాయి ఎన్ఫోర్స్‌మెంట్ కు సంబంధించి




సమన్వయంతో పని చేస్తున్నామన్నారు. ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి కర్నూలు నంద్యాల జిల్లాలో ఎక్సైజ్ శాఖ తీసుకుంటున్న చర్యలను గురించి వివరించారు.సమావేశంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ హనుమంత రావు, సూపరింటెండెంట్ సుధీర్, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, మంత్రాలయం టీడీపీ పార్టీ ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి, ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# గనుల రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు



**:- ఇసుక సరఫరాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదు**

**:- ప్రభుత్వానికి మంచి పేరు వచ్చే విధంగా అధికారులు పని చేయాలి**

**:- రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు మరియు ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర**

కర్నూలు, ఆదిత్య న్యూస్ మే 21:- గనుల రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, ఇసుక సరఫరాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని,ప్రభుత్వానికి మంచి పేరు వచ్చే విధంగా అధికారులు పని చేయాలని రాష్ట్ర గనుల, భూగర్భ వనరులు మరియు ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో మైన్స్ అండ్ జియాలజీ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మైనింగ్‌కు సంబంధించి గత ఐదేళ్లలో ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారన్నారు. మన ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈజ్ ఆఫ్ డూయింగ్ తో పాటు, పర్మిషన్స్ (ఈసీ పర్మిషన్స్ వంటివి) త్వరితగతిన ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మైనింగ్ రంగంలో ఎక్కువ శాతం మందికి ఉపాధి కల్పించే అవకాశం ఉంది కాబట్టి అందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రధానంగా ఇసుకకు సంబంధించి గత 5 ఏళ్లలో వ్యవస్థ అస్తవ్యస్తమైందన్నారు. భవన నిర్మాణ రంగం కుదేలయిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నష్టపోయినా పర్వాలేదు కానీ, ప్రజలకు ఇసుక అందుబాటులో ఉంచాలని ఉచిత ఇసుక పాలసీ అమలు చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారన్నారు. ప్రతి సంవత్సరం సగటున ప్రభుత్వానికి రావాల్సిన 300 కోట్ల రూపాయలు ఆదాయం తగ్గిపోయినా, ప్రజలకు ఇసుక సరఫరా లో ఎక్కడా కూడా ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో ఇసుక కొరత లేకుండా చూడాలన్నారు. ఎన్జీటీ పర్మిషన్స్ ఇవ్వడంలో, ఈసీ పర్మిషన్స్ ఇవ్వడంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. మైనింగ్ లో "వ్యాల్యూ ఎడిషన్ (Value addition) కి వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. పరిశ్రమలకు సంబంధించి ఇవాళ భారతదేశంలో వచ్చిన పెట్టుబడులలో 25% పెట్టుబడులు ఒక్క ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి వచ్చాయన్నారు. గూగుల్ (Google), ఆర్సెలార్ మిట్టల్ (ArcelorMittal), మొన్ననే గవర్నమెంట్ ఆఫ్ ఇండియా డిఫెన్స్ ప్రాజెక్ట్ కి సంబంధించి రాకెట్ మ్యానుఫ్యాక్చరింగ్స్ పుట్టపర్తి లో రక్షణ రంగానికి చెందిన ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారన్నారు.కర్నూలు జిల్లాలో డ్రోన్ సిటీ, రిలయన్స్ తదితర పరిశ్రమలు వచ్చాయన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మైనింగ్ రంగ అభివృద్ధికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి మాట్లాడుతూ ఇసుకకు సంబంధించి జిల్లాలో 5 ఓపెన్ రీచ్ లు, 5 డీసిల్టేషన్ పాయింట్స్ ఉన్నాయన్నారు. ఓపెన్ రీచ్ లు అన్నీ పని చేస్తున్నాయని, డీసిల్టేషన్ పాయింట్స్ కూడా పని చేస్తున్నాయన్నారు. ఓపెన్ రీచ్ ల దగ్గర దాదాపు 3 టన్నుల ఇసుక ఉందన్నారు. కాబట్టి జిల్లాలో ఇసుక కొరత సమస్య ఏమీ లేదన్నారు. డీసిల్టేషన్ పాయింట్స్ వద్ద కూడా ఇసుక అందుబాటులో ఉందన్నారు. ఎండ కాలంలో కూడా డీసిల్టేషన్ పాయింట్స్ లో వర్క్ జరుగుతుంది కాబట్టి, టార్గెట్ చేసినంత ఇసుక పరిమాణాన్ని పొందగలమని కలెక్టర్ తెలిపారు. జూన్ 1 వ తేది నుండి అక్టోబర్ 15 వ తేదీ వరకు 6 లక్షలు టన్నుల ఇసుక అందుబాటులో ఉండాలని టార్గెట్ ఇచ్చారని, కానీ



12 లక్షల టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. కాబట్టి కర్నూలు జిల్లాలో ఇసుక సరఫరాకు ఎటువంటి సమస్య లేదన్నారు. నంద్యాల జిల్లాకు కూడా రెండు డిపోల ద్వారా ఇసుక సరఫరా చేస్తున్నామన్నారు. ఒకటి ఆత్మకూర్ మరియు ఇంకొకటి నందికొట్కూరు అని తెలిపారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ అక్రమంగా ఇసుక రవాణా చేయకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అక్రమంగా ఇసుక తరలించే వాహనాలను సీజ్ కూడా చేయడం జరిగిందన్నారు..

### జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ

జిల్లాల విభజన జరిగిన తర్వాత, మేజర్ మినరల్స్ (ముఖ్యమైన ఖనిజాలు) నంద్యాల జిల్లాకు వెళ్ళాయన్నారు. చిన్న చిన్న సిమెంట్ ఫ్యాక్టరీలు మాత్రమే ఇక్కడ ఉన్నాయన్నారు. ఇసుక అందుబాటులో ఉందని ఎలాంటి సమస్య లేదన్నారు. అన్ని రీచ్‌లు కూడా ఇప్పుడు ఫంక్షనింగ్‌లో ఉన్నాయన్నారు. రానున్న 3 నెలలకు స్టాక్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. ఎప్పుడైనా ఫిర్యాదులు వస్తే, వెంటనే చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో టీడీపీ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ, గ్రంథాలయ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, మంత్రాలయం టీడీపీ పార్టీ ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, ఇంచార్జి డిడి మైన్స్ నాగిని, గనుల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక రీచ్‌ల నిర్వహణ పారదర్శకంగా ఉండాలి





**సి.బెలగల్ మండలం ఈర్లదిన్నె ఇసుక రీచ్, డీసిల్టేషన్ పాయింట్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రి**

**రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర**


కర్నూలు, ఆదిత్య న్యూస్ మే 21::-జిల్లాలో ఇసుక రీచ్‌ల నిర్వహణ పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా కొనసాగాలని రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ మరియు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర గారు అధికారులను ఆదేశించారు.గురువారం సి.బెలగల్ మండలం ఈర్లదిన్నె వద్ద ఉన్న ఇసుక రీచ్‌తో పాటు డీసిల్టేషన్ పాయింట్‌ను మంత్రి క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీ చేసి నిర్వహణ తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా ఇసుక నిల్వలు, బుకింగ్ ప్రక్రియ, రశీదుల జారీ విధానం తదితర అంశాలను మంత్రి కంటైనర్ కియోస్క్ లోకి వెళ్లి స్వయంగా పరిశీలించి సంబంధిత



అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఇసుక సరఫరాలో ఎటువంటి అక్రమాలు, అవకతవకలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారదర్శక విధానంలో ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు కొనసాగించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఇసుక రీచ్‌లో డ్రెడ్జింగ్ ద్వారా జరుగుతున్న లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించిన మంత్రి, కార్మికుల పనితీరు, భద్రతా చర్యలు, రవాణా విధానంపై ఆరా తీశారు. బోటులో ప్రయాణించి తుంగభద్ర నది లో డ్రెడ్జింగ్ ద్వారా దాదాపు 15 అడుగుల నీటి క్రింద ఉన్న ఇసుకను తీయించి నాణ్యతను పరిశీలించారు.తీర ప్రాంతాలను పరిశీలిస్తూ డీసిల్టేషన్ పనుల పురోగతి, నది ప్రవాహ పరిస్థితులు, ఇసుక నిల్వల స్థితిగతులను పరిశీలించారు. ఇసుక తవ్వకాలు పర్యావరణానికి హాని కలగకుండా, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు పాటిస్తూ , ప్రభుత్వ నిబంధనలకు లోబడి నిర్వహించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇసుక సరఫరాలో పారదర్శకతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.జిల్లా మైన్స్ అధికారి నాగిని రీచ్ ఇసుక లభ్యత వివరాలు మంత్రికి తెలియచేశారు. ఈ పర్యటనలో కోడుమూరు శాసనసభ్యులు బొగ్గుల దస్తగిరి , కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, జిల్లా తెలుగుదేశం అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ , సి.బెలగల్ తహసీల్దార్ వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 22 వ తేదీన పాణ్యం నియోజకవర్గ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ( పిజిఆర్ఎస్) నిర్వహణ

**కర్నూలు నగరంలోని ఎస్ బీ ఐ కాలనీ లో ఉన్న మున్సిపల్ కౌన్సిల్ హాల్ లో ప్రజల నుండి వినతుల స్వీకరణ : జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**



కర్నూలు, ఆదిత్య న్యూస్ మే 21: ఈ నెల 22 వ తేదీన పాణ్యం నియోజకవర్గ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ( పిజిఆర్ఎస్) నిర్వహణ లో భాగంగా కర్నూలు నగరం లోని ఎస్ బీ ఐ కాలనీ లో ఉన్న మున్సిపల్ హాల్ లో ప్రజల నుండి వినతులను స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఒక ప్రకటన లో తెలిపారు.ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ( పిజిఆర్ఎస్) నిర్వహించడం జరుగుతుందని, ఇందులో భాగంగా వచ్చే శుక్రవారం 22 వ తేదీన పాణ్యం నియోజకవర్గ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ( పిజిఆర్ఎస్) ను నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. కర్నూలు నగరంలోని ఎస్ బీ ఐ కాలనీ లో ఉన్న మున్సిపల్ కౌన్సిల్ హాల్ లో 22 వ తేదీ ఉదయం 10 గంటల నుండి ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. జిల్లా కలెక్టర్, పాణ్యం ఎమ్మెల్యే, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, కల్లూరు, ఓర్వకల్లు మండలాలు, నగర పరిధిలోని 16 వార్డ్ లలో ఉన్న ప్రజలు తమ సమస్యలను తెలుపుకోవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## యూరియా అమ్మకాల్లో తేడాలు వస్తే చర్యలు తప్పవు

**ఎమ్మిగనూరులో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన జాయింట్ కలెక్టర్**

**జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్**





కర్నూలు, ఆదిత్య న్యూస్ మే 21: యూరియా అమ్మకాల్లో తేడాలు వస్తే చర్యలు తప్పవని జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పేర్కొన్నారు.గురువారం ఎమ్మిగనూరు పట్టణంలోని గురు రాఘవేంద్ర ట్రేడర్స్, శ్రీ వెంకట రాజరాజేశ్వరి ట్రేడర్స్, పలు ఎరువుల దుకాణాలను జాయింట్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన ఎరువులు సరైన ధరలకు అందుతున్నాయా లేదా అన్న దానిపై క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా దుకాణాలలో నిల్వలు, విక్రయ రికార్డులు, స్టాక్ రిజిస్టర్లు, ధరల పట్టికలు, లైసెన్సుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు.ఈ సందర్భంగా జాయింట్...తనిఖీల సమయంలో కొన్ని దుకాణాల్లో రికార్డుల నిర్వహణలో లోపాలు, స్టాక్ వివరాల్లో వ్యత్యాసాలు, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహణ వంటి లోపాలు గుర్తించినట్లు తెలిపారు. ఈ అంశంపై సమగ్ర నివేదికను సమర్పించాల్సిందిగా ఎమ్మిగనూరు వ్యవసాయ సహాయ సంచాలకులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. నివేదిక ఆధారంగా సంబంధిత దుకాణాలపై తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. రైతులను మోసం చేసే విధంగా ఎవరైనా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎరువుల విక్రయంలో పారదర్శకత పాటించాలని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే రైతులకు ఎరువులు అందించాలని దుకాణదారులకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసులు, ఎమ్మిగనూరు వ్యవసాయశాఖ అధికారి ఖాద్రీ, తదితరులు పాల్గొన్నారు

## గృహ గణన గడువులోగా పూర్తిచేయాలి

**కేంద్ర ప్రభుత్వానికి ఖచ్చితమైన జనాభా వివరాలు అందించడం సర్వే లక్ష్యం**

**ప్రతి ఇంటిని సందర్శించి పూర్తి వివరాలు నమోదు చేయాలి**

**గృహ గణనలో ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి**

**సెన్సస్ డిప్యూటీ డైరెక్టర్ దిబాకర్ బరిహా**





కర్నూలు ఆదిత్య న్యూస్ మే 21 : నగరంలో కొనసాగుతున్న గృహ గణన (సెన్సస్) సర్వే ప్రక్రియను నిర్ణీత గడువులోగా పక్కాగా పూర్తి చేయాలని కేంద్ర సెన్సస్ డిప్యూటీ డైరెక్టర్ దిబాకర్ బరిహా అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన జిల్లా ఇన్చార్జి ఎన్.దిపక్ భరద్వాజ్, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డితో కలిసి సుంకేసుల రోడ్డు, జిపిఆర్ నగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటి గణన ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న జనగణన ప్రక్రియ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల రూపకల్పనకు ఎంతో కీలకమని తెలిపారు. ప్రతి ఇంటిని తప్పకుండా సందర్శించి, కచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా డేటా నమోదు చేయడం ద్వారా భవిష్యత్తు ప్రణాళికలకు ఉపయోగకరమైన సమాచారం అందుతుందని పేర్కొన్నారుప్రస్తుతం అనేక రాష్ట్రాల్లో గృహ గణన ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోందని, ఆంధ్రప్రదేశ్‌లో కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి సర్వేను సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగర ప్రాంతాల్లో వలసలు, అద్దె నివాసాలు అధికంగా ఉండటంతో ప్రతి ఇంటిని గుర్తించి వివరాలు సేకరించాలని సూచించారు.జిల్లా ఇన్చార్జి ఎన్.దిపక్ భరద్వాజ్ మాట్లాడుతూ.. ఫీల్డ్ స్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది ప్రతిరోజూ నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రజలు కూడా గృహ గణన సిబ్బందికి సరైన సమాచారం అందించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 30 లోపు ఇంటి గణన ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు.

## నదుల్లో స్వచ్ఛత పనులు ముమ్మరం..





**ప్రజారోగ్య పరిరక్షణకు యుద్ధప్రాతిపదికన చర్యలు**

**కెసి కెనాల్, హంద్రీ నదిలో విస్తృత స్థాయిలో శుభ్రత పనులు**

**ప్రత్యేక సిబ్బంది, జెసిబిలతో చెత్త తొలగింపు**

కర్నూలు ఆదిత్య న్యూస్ మే 21 : నగరంలోని నదులను పరిశుభ్రంగా ఉంచేందుకు నగరపాలక సంస్థ అధికారులు విస్తృత స్థాయిలో స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన పనులు కొనసాగిస్తున్నారు. మంత్రి టీజీ భరత్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఇటీవల కెసి కెనాల్, హంద్రీ నది ప్రాంతాలను పరిశీలించి తక్షణ చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. దీనిలో భాగంగా కెసి కెనాల్‌లో పేరుకుపోయిన చెత్త, మురుగును జెసిబిల సహాయంతో తొలగిస్తున్నారు. అలాగే మెట్లు, పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య సిబ్బందిని నియమించి శుభ్రత పనులు చేపట్టారు. నది పరిసర ప్రాంతాల్లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయడంతో పాటు ఇరువైపులా ప్రత్యేక కార్మికులను విధుల్లో ఉంచి, మళ్లీ అపరిశుభ్రత నెలకొనకుండా పర్యవేక్షణ చేపడుతున్నారు. అదేవిధంగా ఆనంద్ టాకీస్ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న హంద్రీ నదిలో ఎన్నో నెలలుగా పేరుకుపోయిన గార్బేజ్‌ను భారీ స్థాయిలో తొలగిస్తున్నారు. నదులను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నగరపాలక అధికారులు పేర్కొంటూ, చెత్తను నదుల్లో వేయకుండా ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## మహారాష్ట్ర ఎన్నికల్లో పోటీకి కాంగ్రెస్ రెండో జాబితా



మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ కోసం కాంగ్రెస్ పార్టీ రెండో జాబితా ప్రకటించింది. మరో 23 మంది అభ్యర్థుల పేర్లను ఖరారు చేసింది. కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ (సీఈసీ) సమావేశం తర్వాత రెండో జాబితాను శనివారం విడుదల చేసింది. కాంగ్రెస్, శివసేన (యూబీటీ) మధ్య వివాదంగా మారిన నాగ్‌పూర్ సౌత్ సీటు కాంగ్రెస్‌కు దక్కింది. ఈ నియోజకవర్గం నుంచి గిరీష్ కృష్ణారావు పాండవ్ బరిలోకి దిగనున్నారు. కాగా, తొలి జాబితాలో 48 మంది అభ్యర్థులను కాంగ్రెస్ ప్రకటించింది. వీరిలో 25 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు. తాజాగా 23 మందితో రెండో జాబితా రిలీజ్ చేసింది. దీంతో కాంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకు 71 మంది అభ్యర్థులను ప్రకటించింది. మరోవైపు మహారాష్ట్రలో ప్రతిపక్ష కూటమి అయిన మహా వికాస్ అఘాడి (ఎంవీఏ)లో ఎలాంటి విభేదాలు లేవని కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసింది. శనివారం సాయంత్రంలోగా భాగస్వామ్య పక్షాల మధ్య తుది సీట్ల పంపకం ఖరారవుతుందని పేర్కొంది. కాగా, మహారాష్ట్రలోని 288 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో నవంబర్ 20న పోలింగ్ జరుగనున్నది.

## జీఐఎస్‌కు ససేమిరా సర్వేకు అడుగడుగునా వ్యతిరేకత


**అనుమానాలను నివృత్తి చేయడంలో బల్దియా విఫలం**

**మూడు నెలలు గడిచినా.. 15వేల ఆస్తులు మాత్రమే గుర్తింపు**

**రాబోయే 15 నెలల్లో 20 లక్షల ఆస్తుల గుర్తింపు అసాధ్యమే..**

**అభిప్రాయపడుతున్న నిపుణులు**

**అందరి ఆమోదం తర్వాతే సర్వే చేయాలని డిమాండ్**




బీ గ్రేటర్‌లో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం(జీఐఎస్) సర్వేకు ప్రజల నుంచి అడుగడుగునా వ్యతిరేకత ఎదురువుతున్నది. 'ఇంటికి సంబంధించిన వివరాలు బల్దియా వద్ద ఉన్నాయి. ప్రాపర్టీ ట్యాక్స్ కడుతున్నాం'.. మళ్లీ సమాచారం కావాలం'టూ.. రావడంపై ప్రజలు అధికారులపై ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. ఎందుకు సర్వే చేస్తున్నారో అధికారులు స్పష్టత ఇవ్వకపోవడం, అనుమానాలను నివృత్తి చేయకపోవడంతో ప్రజలు సహకరించడం లేదు. సర్వేకు అడ్డంకులు వస్తుండటంతో నిర్ణీత గడువులోగా లక్ష్యం దాటడం కష్టమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. స్థానికంగా సమావేశాలు ఏర్పాటు చేసి, అందరి ఆమోదం తర్వాతే సర్వే ప్రక్రియ చేపట్టాలని నిపుణులు చెబుతున్న మాట. జీహెచ్‌ఎంసీ పరిధిలో జీఐఎస్ సర్వే ప్రక్రియ ఈ ఏడాది జూలై 30న ప్రారంభించారు. ఈ జీఐఎస్ సర్వేకు జీహెచ్‌ఎంసీ దాదాపు రూ. 21 కోట్లు ఖర్చు చేస్తున్నది. గ్రేటర్ పరిధిలో ప్రతి ఆస్తిని, నిర్మాణాన్ని, ఖాళీ ప్లాట్లను, నివాసాలను, వ్యాపార భవనాలను గుర్తించి.. మ్యాపింగ్ చేసేందుకు గరిష్ఠంగా 18 నెలల గడువు తీసుకుని 20 లక్షల ఆస్తులను గుర్తించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే గడిచిన మూడు నెలల్లో 15వేల ఆస్తులను మాత్రమే లెక్కించినట్టు అధికారులు చెబుతున్నారు. మూడు నెలల్లో కనీసం 15వేల ఆస్తుల గుర్తింపునకే పరిమితమైతే వచ్చే 15 నెలల్లో 20 లక్షల ఆస్తుల గుర్తింపు సాధ్యమేనా అన్న ప్రశ్న తలెత్తుతున్నది. ఈ సర్వేపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, బాధ్యతాయుతంగా వ్యవహరించకపోవడంతో ఈ ప్రక్రియ కేవలం ప్రకటనలకే పరిమితమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్ని ప్రాంతాల్లో సర్వే చేశారు..? ఎన్ని ఆస్తులను గుర్తించారు? డ్రోన్ సర్వేలు ఎక్కడెక్కడ చేశారు? ఇంటింటి సర్వేలు ఏ ప్రాంతాల్లో పూర్తి చేశారు..? అనేది గోప్యంగా ఉంచడం మరిన్ని అనుమానాలకు తావిస్తున్నది.


### ఇంటింటికీ డిజిటల్ డోర్ నంబర్లు

ఇంటింటికీ ప్రత్యేకంగా డిజిటల్ డోర్ నంబర్లు ఇస్తామని, దానిపై క్యూఆర్ కోడ్ వల్ల ఆ ఇంటికి లేదా వీధిలో ఎలాంటి సేవలు అందుతాయనే విషయాలు క్షణాల్లో తెలిసిపోతాయని చెప్పారు. డోర్ టు డోర్ సర్వేలో అవసరమైన సపోర్ట్ డాక్యుమెంట్లతో పాటు ప్రాపర్టీస్, యుటిలిటీస్ , ఇన్ఫ్రాస్ట్రక్చర్స్‌కు సంబంధించిన సమాచారాన్ని మాత్రమే సేకరిస్తారని స్పష్టం చేశారు. కాగా, అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలో ప్రజల నుంచి సేకరిస్తున్న వివరాలతో చాలా మంది ఆందోళన చెందుతున్నారు. సర్వేకు వచ్చిన అధికారులు, సిబ్బంది జీహెచ్‌ఎంసీకి సంబంధించిన వారేనా? లేదంటే ప్రైవేట్ వ్యక్తులా? అన్న కోణంలో కొందరు? సమగ్ర వివరాలు ఇస్తే ..ఆస్తిపన్ను భారం మరింత పడుతుందని మరికొందరు? జీహెచ్‌ఎంసీ వద్ద వివరాలు ఉన్నప్పటికీ మళ్లీ ఎందుకు అడుగుతున్నారని మరికొందరు సర్వేకు దూరంగా ఉంటున్నారు.

### ఫిజికల్ సర్వేకు ప్రజలు దూరం

అర్బన్ ప్లానింగ్, రిసోర్స్ మేనేజ్‌మెంట్ మెరుగుపరిచేందుకు జీహెచ్‌ఎంసీ పరిధిలోని అన్ని ఆస్తులు, యుటిలిటీస్ మ్యాప్ చేయడానికి ఇంటిగ్రేటెడ్ జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం సర్వేను నిర్వహిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. జీఐఎస్‌తో బల్దియా మొత్తాన్ని డ్రోన్ ద్వారా సర్వే చేసి రికార్డు చేస్తున్నామని, దీంతో ప్రభుత్వ భూములు, చిన్న, పెద్ద రోడ్లు, చెరువులు, సరస్సులు ఇలా సిటీ మొత్తం మ్యాపింగ్ జరుగుతుందన్నారు. డ్రోన్ సర్వే పూర్తయ్యాక ప్రతి అంశం మ్యాపింగ్ ఉంటుందని, తద్వారా వీధుల్లో విద్యుత్ దీపాల దగ్గరి నుంచి చెత్త సేకరణ వరకు ప్రతి అంశం జీహెచ్‌ఎంసీకి సమగ్ర వివరాలు అందుతాయని అధికారులు పేర్కొంటున్నారు. ఆస్తిపన్ను మదింపులోనూ చాలా సులభతరం అవుతుందని పేర్కొంటున్నారు.

## సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇరాన్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడులు





అన్నంతపని చేసింది. ఇరాన్‌పై ప్రతికారేచ్చతో రగిలిపోతున్న టెల్అవీవ్.. టెహ్రాన్‌పై బాంబులతో విరుచుకుపడింది. ఇరాన్‌కు చెందిన సైనిక స్థావరాలే లక్ష్యంగా శనివారం తెల్లవారుజామున నుంచి ఇజ్రాయెల్ దళాలు దాడులు చేస్తున్నాయి. టెహ్రాన్‌తోపాటు సమీప స్థావరాలపై పలు పేలుళ్లు జరిగినట్లు అక్కడి మీడియా వార్తలు వెల్లడించింది. ఈనెల 1న ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడిన విషయం తెలిసిందే. దాదాపు 200 మిసైల్స్‌ను టెల్అవీవ్‌పై ప్రయోగించింది. ఈ దాడులకు ప్రతీకారం తీర్చుకుంటామని ఇజ్రాయెల్ అప్పట్లోనే ప్రతిజ్ఞ చేసింది. తాజాగా ఇరాన్‌పై ఐడీఎఫ్ ఎదురుదాడులతో విరుచుకుపడుతున్నది. ఇజ్రాయెల్‌పై ఇరాన్ తరచూ దాడులకు దిగుతున్నది, ప్రతీకరంగా ఎదురు దాడులు ప్రారంభించామని ఐడీఎఫ్ అధికార ప్రతినిధి డేనియల్ హగారీ తెలిపారు. ప్రస్తుతం ఇరాన్‌లోని సైనిక లక్ష్యాలపై ఇజ్రాయెల్ రక్షణ దళాలు ఖచ్చితమైన దాడులు నిర్వహిస్తున్నాయని వెల్లడించారు. ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ఇరాన్ చేసిన దాడులకు ప్రతిస్పందనగా ఐడీఎఫ్ దాని సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు చేస్తున్నదని పేర్కొన్నారు. ప్రపంచంలోని అన్ని సార్వభౌమ దేశాల మాదిరిగానే ఇజ్రాయెల్‌కు ప్రతిస్పందించే హక్కు, బాధ్యత తమకు ఉందన్నారు. మా దేశాన్ని, ప్రజలను రక్షించుకునేందుకు ఏదైనా చేస్తామని స్పష్టం చేశారు. కాగా, ఇరాన్‌పై ప్రతీకారంగా ఇజ్రాయెల్ చేస్తున్న వైమానిక దాడుల్లో అమెరికా ప్రమేయం లేదని అమెరికాకు చెందిన ఓ అధికారి వెల్లడించారు. అయితే ఈ దాడులకు సంబంధించి అమెరికాకు ముందే సమాచారం ఉన్నట్లు సమాచారం. ఇక వైమానిక దాడుల నేపథ్యంలో ఇరాక్ తన విమానాశ్రయాల్లో రాకపోకలను నిలిపివేసింది.

## ప్రజలకు పారదర్శకంగా ఇసుక సరఫరా...

# ఫ్రీ సాండ్ పాలసీ అమలే ప్రభుత్వ లక్ష్యం

**రాష్ట్రంలో అన్ని ఇసుక రీచ్‌లు, డీసిల్టేషన్ పాయింట్లు ప్రారంభించి విస్తృతంగా ఇసుక నిల్వలు ఏర్పాటు చేశాం**

**రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ మరియు ఎక్సైజ్ శాఖ మంత్రి వర్యులు కొల్లు రవీంద్ర**





కర్నూలు, ఆదిత్య న్యూస్ మే 21:రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అతి తక్కువ ధరకే ఇసుక అందుబాటులో ఉండేలా పారదర్శక విధానంతో ముందుకు సాగుతోందని రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. గురువారం కర్నూలు జిల్లా సి.బెలగల్ మండలం ఈర్లదిన్నె ఇసుక రీచ్, డీసిల్టేషన్ పాయింట్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ...ప్రభుత్వానికి ఎటువంటి ఆదాయం లేకపోయినా ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అతి తక్కువ ధరకే ఇసుకను అందిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడెక్కడ ఇసుక రీచ్‌లు ఉన్నాయో వాటిని ప్రారంభించడం జరిగిందన్నారు. అలాగే డీసిల్టేషన్ పాయింట్లను కూడా ఏర్పాటు చేసి ప్రజలకు నిరంతరాయంగా ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. గత రెండు సంవత్సరాల్లోనే రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రెండున్నర కోట్ల టన్నుల ఇసుకను ప్రజలకు సరఫరా చేయడం జరిగిందని వెల్లడించారు. ప్రస్తుతం నిర్మాణ రంగంలో విస్తృతంగా పనులు కొనసాగుతున్న నేపథ్యంలో ఇసుకకు భారీ డిమాండ్ ఉందన్నారు. జూన్ నెల నుంచి వర్షాకాలం ప్రారంభమవుతుండటంతో ఆ సమయంలో ఇసుక సేకరణ పై పరిమితులు ఉంటాయని, అందుకే ముందస్తుగా అన్ని ఇసుక రీచ్‌ల వద్ద భారీగా స్టాక్‌లు సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. సి. బెలగల్ మండలం ఈర్లదిన్నె గ్రామ సమీపంలో ఉన్న డీసిల్టేషన్ పాయింట్‌లో జరుగుతున్న పనులను, నిల్వలను, ఇసుక నిర్వహణ విధానాన్ని స్వయంగా పరిశీలించామని మంత్రి తెలిపారు. కేవలం డీసిల్టేషన్ చార్జీలతో కలిపి టన్ను ఇసుకను రూ.202కే అందిస్తున్నామని చెప్పారు. రవాణా ఖర్చులు మాత్రం దూరాన్ని బట్టి ఉంటాయని, వాహన సామర్థ్యానికి అనుగుణంగా ఇసుక రవాణా జరుగుతోందన్నారు. ప్రజలకు పారదర్శకంగా ఇసుక అందించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇసుక కొరత కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, నిర్మాణ రంగం దెబ్బతిన్నదన్నారు. ఇసుక అందుబాటులో లేకపోవడంతో పాటు అక్రమాలు పెరిగి, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసులు నమోదై అధికారులకు కూడా ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మాత్రం ప్రజలకు సులభంగా, పారదర్శకంగా ఇసుక అందే విధంగా సమగ్ర విధానాన్ని అమలు చేస్తోందన్నారు. ఎక్కడైనా చిన్నపాటి లోటుపాట్లు కనిపించినా వెంటనే స్పందించేందుకు కేంద్ర కార్యాలయంలో టోల్ ఫ్రీ నెంబర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. రియల్ టైం గవర్నెన్స్ ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని, ప్రజల అభిప్రాయాలను స్వీకరిస్తూ ఎక్కడైనా సమస్యలు తలెత్తితే తక్షణమే చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరికీ ఫ్రీ సాండ్ పాలసీ ద్వారా అందుబాటు ధరలో నాణ్యమైన ఇసుక అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.జిల్లా మైన్స్ అధికారి నాగిని రీచ్ ఇసుక లభ్యత వివరాలు మంత్రికి తెలియచేశారు. ఈ పర్యటనలో కోడుమూరు శాసనసభ్యులు బొగ్గుల దస్తగిరి , కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, జిల్లా తెలుగుదేశం అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ , సి.బెలగల్ తహసీల్దార్ వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# రీ-సర్వే ప్రక్రియను పకడ్బందీగా పారదర్శకంగా పూర్తి చేయాలి



**నందవరం గ్రామంలో గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జాయింట్ కలెక్టర్**

**రైతుల సమస్యలు తెలుసుకొని, సర్వే సిబ్బంది పలు సూచనలు సూచించిన జేసీ**

**జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్**

కర్నూలు, ఆదిత్య న్యూస్ మే 21: రీ-సర్వే ప్రక్రియను పకడ్బందీగా పారదర్శకంగా పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పేర్కొన్నారు.గురువారం నందవరం మండలం నందవరం గ్రామంలో కొనసాగుతున్న భూ రీ-సర్వే గ్రౌండ్ ట్రూతింగ్ పనులను జాయింట్ కలెక్టర్ సర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వ్యవసాయ భూములను సందర్శించి, సర్వే ప్రక్రియను ప్రత్యక్షంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్...భూ సరిహద్దుల నిర్ధారణ, ఫీల్డ్ మ్యాపింగ్, రికార్డుల పరిశీలన వంటి అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులతో నేరుగా మాట్లాడి, సర్వే సందర్భంగా ఎదురవుతున్న సమస్యలు, సందేహాలను తెలుసుకొని వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రీ-సర్వే కార్యక్రమం రైతులకు భూసంబంధిత వివాదాలు లేకుండా స్పష్టమైన హక్కులు కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. సర్వే ప్రక్రియ పూర్తి పారదర్శకతతో, ఖచ్చితత్వంతో నిర్వహించాలని ఆదేశించారు. గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, రైతుల సమక్షంలోనే భూ సరిహద్దులను నిర్ధారించాలని సర్వే బృందానికి సూచించారు.



ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి అభ్యంతరాలను వెంటనే నమోదు చేసి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రీ-సర్వే పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, భూ రికార్డులను ఆధునీకరించే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అబ్దుల్ వహాబ్ , ఉప తహశీల్దార్ మహేష్, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శ్రీనివాస రాజు, రెవెన్యూ సర్వే అధికారులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# హైబీపీ తగ్గాలంటే ఈ డైట్‌ను పాటించండి రిజల్ట్ మీరే చూస్తారు

ఆరోగ్యంగా ఉండాలంటే డైట్‌ను కచ్చితంగా పాటించాలి. మనం పాటించే డైట్ వల్లే మనం ఆరోగ్యంగా ఉంటాం. ఎలాంటి వ్యాధులు రాకుండా ఉంటాయి. అయితే హైబీపీని తగ్గించుకునేందుకు కూడా డైట్‌ను పాటించాల్సి ఉంటుంది. హైబీపీ అనేది ప్రస్తుతం చిన్న వయస్సులో ఉన్నవారికి కూడా వస్తోంది. అలాంటి వారు డాష్ డైట్‌ను పాటిస్తే ఫలితం ఉంటుంది. దీన్నే డైటరీ అప్రోచెస్ టు స్టాప్ హైపర్ టెన్షన్ (%ణూూం%) అని కూడా అంటారు. ఈ డైట్ ప్రస్తుతం బాగా ట్రెండ్ అవుతోంది. హైబీపీ తగ్గాలంటే ఈ డైట్‌ను పాటించాలని పోషకాహార నిపుణులు సైతం చెబుతున్నారు. ఇక ఈ డైట్‌ను ఏమిటో, ఇందులో భాగంగా ఎలాంటి ఆహారాలను తీసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం.డాష్ డైట్ అనేది ప్రాసెస్ చేయబడిన ఆహారాలకు దూరంగా ఉండాలనే నియమాన్ని సూచిస్తుంది. ఈ డైట్‌ను పాటించే వారు అలాంటి ఆహారాలను అసలు తీసుకోకూడదు. అందుకు బదులుగా పండ్లు, కూరగాయలు, తృణ ధాన్యాలు, ప్రోటీన్లు ఉండే ఆహారాలు, ఆరోగ్యకరమైన కొవ్వులను తినాలని ఈ డైట్ సూచిస్తుంది. ఇందులో భాగంగా చక్కెర తీసుకోవడాన్ని తగ్గించాలి. అనారోగ్యకరమైన కొవ్వులు ఉండే ఆహారాలను, సోడియం ఎక్కువగా ఉండే ఆహారాలను కూడా తీసుకోవడం మానేయాలి. అప్పుడు డాష్ డైట్ పాటించినట్లు అవుతుంది.ఈ డైట్‌లో భాగంగా విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండే ఆహారాలను తినాల్సి ఉంటుంది. తృణ ధాన్యాలను రోజువారి ఆహారంలో కచ్చితంగా తీసుకోవాలి. ముఖ్యంగా బ్రౌన్ రైస్, క్వినోవా, గోధుమలతో చేసిన బ్రెడ్‌ను తినాల్సి ఉంటుంది. ఈ ఆహారాల్లో ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది.

# సైకిలే ఆమె ప్రపంచం



సైకిల్ తొక్కడం పిల్లలకు సరదా. యువతకు సాహసం. పెద్దలకు ఆరోగ్యం. అమెరికా అమ్మాయి లేల్ విల్‌కాక్స్‌కి సైకిలే ప్రపంచం.స్నేహం, సాహసం, ప్రేమ, ప్రయాణం, జీవితం.. తనకన్నీ సైకిలే అంటుందామె. అబ్బాయి ప్రేమలో పడి సైక్లింగ్ అలవాటు చేసుకున్న ఆ అమ్మాయి.. బ్రేకప్ అయినా సైకిల్ రైడ్‌ని బ్రేక్ లేకుండా సాగించింది. అదే సైకిల్‌పై ప్రపంచాన్ని చుట్టొచ్చి గిన్నిస్ రికార్డులకెక్కింది! ఆ సాహస ప్రేమగాథే ఈ సైకిల్ రైడ్! లేల్ విల్‌కాక్స్ అమెరికాలోని అలస్కాలో పుట్టి పెరిగింది. నేచురల్ సైన్స్, ఫ్రెంచ్ సాహిత్యంలో బ్యాచ్‌లర్ డిగ్రీ చదివింది. పదిహేనేండ్ల కిందట నికొలస్ కమన్ అనే అబ్బాయి ఆమెకు పరిచయమయ్యాడు. అతని ప్రేమలో పడింది. అతనితోపాటే సైకిల్ ప్రేమలోనూ పడింది. ప్రేమ, సైకిల్ రైడ్ రెండే ప్రపంచం అన్నట్టుగా సాగిపోయారిద్దరూ. ప్రేమికుడితో కలిసి సైకిల్ రైడ్ మొదలుపెట్టింది. ప్రేమలో అలా సాగిపోతున్న ఆ జంట లక్ష్యం.. లక్ష మైళ్ల దూరం కలిసి ప్రయాణించడం. అందుకోసం 30కి పైగా దేశాలు పర్యటించాలని అనుకున్నారు. అమెరికాలోని కొన్ని నగరాల్లో సైకిళ్లపై విహరించారు. ఈ ప్రయాణంలో పాఠశాల పిల్లల కోసం సైకిళ్లను సేకరించడం, విద్యార్థులకు సైకిల్ మరమ్మతులు నేర్పించడం లాంటివి చేసేవారు. ఈ క్రమంలో విల్‌కాక్స్ %ఙతీఖఅం ూాఎ% 2016 పోటీల్లో పాల్గొంది. పోటీలో భాగంగా అమెరికా పశ్చిమ తీరం నుంచి బయలుదేరి తూర్పు తీరానికి చేరుకోవాలి. 4,400 మైళ్ల దూరాన్ని 18 రోజుల్లో అలవోకగా పూర్తి చేసింది విల్‌కాక్స్. సైక్లిస్టులు ధరించే ప్రత్యేకమైన దుస్తులు లేకుండా, సాధారణ డ్రెసింగ్‌తో పోటీపడ్డ ఆమె గెలుపును చూసి అందరూ ఆశ్చర్యపోయారు. ఈ రైడ్‌ను పూర్తి చేసిన తొలి మహిళగా, గెలిచిన మొదటి అమెరికన్‌గా రికార్డ్ సృష్టించింది. ఆ తర్వాత లెక్కలేనన్ని సైకిల్ రైడ్స్‌లో గెలిచింది. ఎంత గెలిచినా ప్రపంచ సైకిల్ యాత్ర చేయాలన్న కోరిక తీరలేదు. ఆ లక్ష్యం కోసం ప్రణాళికలు రూపొందించుకుని సాగుతున్న విల్‌కాక్స్, కమన్ జోడీ 2017లో విడిపోయింది. ఉత్సాహంగా సాగిన వాళ్ల ప్రయాణానికి బ్రేక్ పడింది.

### ప్రపంచ యాత్ర

కమన్‌తో ప్రేమ చెడినా అతని వల్ల అలవడిన సైకిల్ రైడ్‌ని విల్‌కాక్స్ వదిలిపెట్టలేదు. చికాగో నగరంలో మే 26న ప్రపంచ సైకిల్ యాత్రను మొదలుపెట్టింది. 1,268 కిలోమీటర్ల దూరంలో ఉన్న న్యూయార్క్ చేరుకొని తొలి లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తిచేసింది. ఆ తర్వాత ఐరోపా యాత్ర కోసం విమానంలో బయలుదేరి పోర్చుగల్‌లో వాలింది. అక్కడి నుంచి తూర్పు దిశగా సవారీ చేస్తూ స్పెయిన్, ఫ్రాన్స్, బెల్జియం, నెదర్లాండ్, జర్మనీ, స్విట్జర్లాండ్, ఇటలీ, ఆస్ట్రియా, స్లోవేకియా, క్రొయేషియా, బోస్నియా, సెర్బియా, బల్గేరియా, టర్కీ, జార్జియా దేశాల మీదుగా సైకిల్ యాత్ర కొనసాగించింది. రెండో దశలో 7,683 కిలోమీటర్ల భారీ దూరాన్ని సులభంగా దాటేసింది. అంతే ఆత్మవిశ్వాసంతో ఆస్ట్రేలియాలోని పెర్త్‌లో అడుగుపెట్టింది. జూలై మాసమంతా ఆ దేశంలోనే గడిపింది. తర్వాత న్యూజిలాండ్‌కు చేరుకొని వారంలో అక్కడ పర్యటన ముగించింది. అక్కడి నుంచి ఉత్తర అమెరికా బయలుదేరింది. అలస్కాలోని ఆంకోరేజ్ నుంచి సైకిల్ యాత్ర ప్రారంభించింది. ఆంకోరేజ్ నుంచి పశ్చిమ కెనడాకు దిగువగా తీర ప్రాంతంలో సైకిల్ యాత్ర సాగిస్తూ లాస్ ఏంజెల్స్ మీదుగా మొట్టమొదట తాను బయలుదేరిన చికాగోకు చేరుకుంది. ఇలా సెప్టెంబర్ 11న ప్రపంచ సైకిల్ యాత్రను ముగించింది.

### ప్రేమ యాత్ర

108 రోజుల 12 గంటల 12 నిమిషాల సుదీర్ఘమైన ప్రయాణంలో 18,125 మైళ్లు ప్రయాణించింది విల్‌కాక్స్! రోజుకు సగటున 166 మైళ్ల దూరం ప్రయాణం చేసిందంటే ఆమె సంకల్ప బలాన్ని అర్థం చేసుకోవచ్చు. కొండ ప్రాంతాలు, ఎగుడు దిగుడు దారుల్లోనూ మొక్కవోని దీక్షతో ప్రయాణం సాగించింది. మంచి రోడ్డు మార్గం ఉన్న రోజు 200 మైళ్ల దూరాన్ని అలవోకగా సైక్లింగ్ చేశానని విల్‌కాక్స్ చెప్పుకొచ్చింది. ఈ సుదీర్ఘ ప్రయాణంతో సైకిల్‌పై ప్రపంచాన్ని వేగంగా చుట్టొచ్చిన మహిళగా ఆమె ప్రపంచ రికార్డు నెలకొల్పింది. స్కాటిష్ సైక్లిస్ట్ జెన్నీ గ్రహమ్ ఆరేండ్ల క్రితం%ఔ% 124 రోజుల 11 గంటలు సైకిల్‌పై ప్రయాణించి గిన్నిస్ రికార్డుల కెక్కింది. ఆ రికార్డుని విల్‌కాక్స్ అధిగమించి చరిత్రకెక్కింది. 38 సంవత్సరాల వయసులో ఈ రికార్డ్ సాధించడం మరో అద్భుతం.

### సైకిల్ సవారీ అంటే సుదూర

ప్రయాణమే కాదు.. అదో సాహసం. ఎత్తయిన పర్వతాలు, లోతట్టు ప్రాంతాలు, మంచు ఎడారులు, తుఫానులు, దుర్గమ అరణ్యాలు, నదులు దాటేందుకు ఎన్నో సాహసాలు చేస్తూ రాత్రీ పగలు ప్రయాణించాలి. అలసట తప్ప భీతి లేని ఈ ప్రయాణంలో ఆమెకు మరో తోడు దొరికింది. రిగులే అనే ఫొటో జర్నలిస్ట్‌ని వివాహమాడింది. ఆయన కూడా ఆమెతో కలిసి సైకిల్ రైడ్ మొదలుపెట్టాడు. విల్‌కాక్స్ సైకిల్ యాత్రలను డాక్యుమెంటరీలు తీసి భార్యపై ప్రేమను చాటుకున్నాడు.

### హిమాలయాల కన్నా ఎత్తు

సముద్రాలు, అగ్ని పర్వతాలు, ఎడారులతో ఉన్న భూమిపై ఒకచోట నుంచి బయలుదేరి ప్రపంచమంతా సైకిల్‌పై చుట్టి రావడం సాధ్యం కాదు. కాబట్టి, గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సైకిల్ యాత్రికులకు కొన్ని మినహాయింపులు ఇచ్చింది. ఒక ఖండం నుంచి మరో ఖండానికి ప్రయాణించడానికి ఇతర ప్రయాణ మార్గాలు ఎంచుకునే వెసులుబాటు కల్పించింది. కానీ, మొత్తం యాత్ర 18,000 మైళ్ల దూరానికి తగ్గ కూడదు. ఉత్తర, దక్షిణ ధృవ సమీప ప్రాంతాల మధ్య సైకిల్ యాత్ర కొనసాగించాలనే నిబంధనా ఉంది. ఈ షరతులకు అనుగుణంగా తన ప్రపంచ యాత్ర లక్ష్యాన్ని నిర్దేశించుకుని సునాయాసంగా విల్‌కాక్స్ లక్ష్యం చేరుకుంది. గిన్నిస్ రికార్డులకెక్కింది. విల్‌కాక్స్ ప్రపంచ యాత్ర ద్వారా దూరంతోపాటు భూగోళాన్ని కింది నుంచి పైకి ఎగబాకిందని చెప్పాలి. అలా గుండ్రంగా ఉన్న భూమిపై ఆమె 6,29,880 అడుగుల ఎత్తుకు సైకిల్‌పై ఎగబాకింది! ఈ ఎత్తు హిమాలయాల కంటే 21 రెట్లు ఎక్కువన్నమాట. ఆశ్చర్యంగా ఉంది కదా!

Editor, Printed, Published and Owned by YARLAPATI SREEDHAR, H.NO-8-83, VYSHYA STREET, MAIN ROAD, VELDURTHI MANDAL & VILLAGE, KURNOOL, ANDHRA PRADESH - 518216. Printed at VSAR PUBLICATIONS, DOOR NO: 41/1077, SANKARAPURAM, KADAPA, Y.S.R., ANDHRA PRADESH - 516002.
Email : jatiyapatrikaadithiya@ Cell: 9705347022, RNI Registration Number : APTEL/25/A2560. Editor : YARLAPATI SREEDHAR,